


నిస్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 262 • పేజీలు : 8 • శుక్రవారం 14 జూన్ 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati




# విజన్‌తో పనిచేస్తా

- తిరుమల నుంచి పాలనా ప్రక్షాళన
- తిరుమలను ఐదేళ్లలో భ్రష్టు పట్టించారు
- తెలుగు రాష్ట్రాలకు పెద్దన్నగా ఉంటా..
- ఇరు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తా..
- సంపదను సృష్టించి పేదలకు పంచడమే లక్ష్యం
- ఏపీ దేశంలోనే నెంబర్ 1న రాష్ట్రంగా ఉండాలి
- ఏపీని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా..
- శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న సీఎం చంద్రబాబు



**తిరుమల, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** టిటిడి నుంచే పాలనా ప్రక్షాళన చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శ్రీవారి సమక్షంలో చెబుతున్నా.. నేను 5కోట్ల ప్రజల మనిషిని. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ 5 ఏళ్ళు ఎంతో ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారని మిగతా 7లో

# బాధ్యతలు స్వీకరణ

- బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు
- మెగా డిఎస్సీ.. ల్యాండ్ టైటిలింగ్‌పై మలి సంతకం
- పెన్షన్ 4వేలు పెంచుతూ మరో సంతకం
- అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం
- ఘనంగా స్వాగతం పలికిన అమరావతి రైతులు
- తిరుమల నుంచి నేరుగా కనకదుర్గ దర్శనం



**అమరావతి,జూన్ 13 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.41 గంటలకు సచివాలయం మొదటిబ్లాక్‌లోని తన ఛాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, మిగతా 7లో

## చంద్రబాబు ప్రకటన సంతోషకరం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** ఏపీ రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతులు, మహిళలు 1631 రోజుల పాటు నిరాటంకంగా ఉద్యమం చేయడం గొప్పవిషయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా అలుపులేకుండా మహిళలు, రైతులు చేసిన ఈ ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అమరావతే ఏపీ రాజధాని అని సీఎం చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు. రాష్ట్రానికి రాజధాని ఒకటే ఉండాలని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు.



## యువత భవిష్యత్తు నాశనం

- నీట్-యూజీ పరీక్షలో గ్రేస్ మార్కుల సమస్య ఒక్కటే కాదు.
- ప్రశ్నపత్రం లీక్ అయింది.
- ప్రమాదంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిత
- నీట్ పరీక్ష వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలి
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే..

7లో

## అమ్మవారి సేవలో సీఎం



- కనక దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి దంపతులు
- ఘన స్వాగతం పలికిన మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ తదితరులు

**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఆయన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ముఖ్యమంత్రి దంపతులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, మిగతా 7లో

## ప్రలోభాలకు లోనుకావద్దు

- శకుని పాచికల్లా ఎన్నికల ఫలితాలు
- ఇవిఎంలపై దేశవ్యాప్త చర్చ జరగాలి
- మండలిలో గట్టిగా పోరాటం చేసే దమ్ము ఉంది
- వైకాపా ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసిన జగన్



**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ఫలితాలు శకుని పాచికల మాదిరి ఉన్నాయంటూ వైకాపా అధ్యక్షుడు జగన్ వివరించారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని జగన్ అభిప్రా యపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన హనీమూన్ నడుస్తోందని.. వారికి మరికొంత సమయం ఇచ్చి.. తర్వాత పోరాడుదాం.. అంటూ ఎమ్మెల్సీలకు వివరించారు. శాసన సభలో అధికార మిగతా 7లో

## యడ్యూరప్పకు షాక్

పోక్సో కోర్టు అరెస్ట్ వారెంట్ 7లో

## అందరినీ నేరుగా కలుస్తా

- బొకేలు, శాలువాలతో రావొద్దు
- 20న పిఠాపురంలో పర్యటిస్తా...
- రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు అభినందనలు, శుభాకాంక్షలు వెల్లువెత్తున్నాయి. ఆయన్ను కలిసేందుకు పార్టీ మిగతా 7లో



## ప్రధాని మోదీ ఇటలీ పయనం

జి 7 దేశాల సదస్సులో పాల్గొననున్న మోదీ 7లో



## నిబద్ధతతో పనిచేస్తా

బాధ్యతలు స్వీకరించిన మంత్రి పెమ్మసాని

కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చినందుకు ప్రధాని మోదీ, చంద్రబాబులకు ధన్యవాదాలు 7లో

## కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై కేంద్రం సీరియస్

- భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ సమీక్ష
- పరిస్థితులను సమీక్షించిన మోదీ
- ఉగ్రమూకలను ఏరేయాలని ఆదేశం
- 4 రోజుల్లో 4 సార్లు జమ్ములో కాల్పులు
- జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రదాడులు



**న్యూఢిల్లీ, జూన్13 :** జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రదాడిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. అక్కడి భద్రతపై సమీక్ష జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజులుగా జమ్ముకశ్మీర్‌లోఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు మిగతా 7లో



## విమానయాన రంగాన్ని ఆధునీకరిస్తాం

- పేదలకు అందుబాటులోకి విమాన సర్వీసులు తెస్తాం
- పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం.
- కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు
- బాధ్యత అప్పగించిన మోడీ, చంద్రబాబులకు కృతజ్ఞతలు...

7లో

## బీజేపీ సర్కార్ కీలక నిర్ణయం

- జగన్నాథ ఆలయంలో తెరుచుకున్న నాలుగు ద్వారాలు
- నాలుగు ద్వారాలు తెరిపిస్తామన్న హామీ అమలు
- నాలుగు ద్వారాల ద్వారా భక్తులకు అనుమతి
- కోవిడ్ టైమ్‌లో మూడు ద్వారాలు మూసివేసిన అప్పటి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్

7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# అన్నమయ్యకు న్యాయం?

పరమ భాగవతోత్తముడు, పదకవితా పితామహుడు అన్నమయ్య గురించి తెలుగువారికి పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు.మహాత్ముడైన అన్నమయ్య భౌతికంగా శరీరాన్ని వీడి ఐదు వందల సంవత్సరాలు దాటిపోయింది. తెలుగు పంచాంగం ప్రకారం దుందుభి నామ సంవత్సరం ఫాల్గుణ మాసం బహుళ ద్వాదశినాడు ఈ కవీశ్వరుడు వేంకటేశ్వరుడులో ఐక్యమయ్యాడు. మే 9వ తేదీ 1408లో జన్మించాడు. కడప ప్రాంతంలోని రాజంపేట దగ్గర 'తాళ్లపాక' వీరి ఊరు, ఇంటిపేరు కూడా అదే. 95 ఏళ్ళపాటు పరిపూర్ణమైన, సంపూర్ణమైన జీవితాన్ని గడిపాడు. సమకాలీన జీవితంలోనూ, ఆ తర్వాత కొన్నేళ్లపాటు ఒక వెలుగు వెలిగాడు. ఉత్తరభారతంలోని సూరదాసు, నందదాసు కంటే దాదాపు వందేళ్ల ముందే భక్తి సంగీతాన్ని ప్రచారం చేసిన భక్తాగ్రేసరుడు. ఈయన ప్రభావం తెలుగుదేశంలోనే కాక,దక్షిణాది మొత్తం విస్తరించింది. ఇంతటి మహనీయుడిని కూడా కొన్ని వందల సంవత్సరాల పాటు లోకం మర్చిపోయింది. వేటూరి ప్రభాకరశాస్త్రి కృషితో ఆ ప్రభ మళ్ళీ పైకి వచ్చింది. నేలమాళిగలలో రాగిరేకుల్లో దాగి వున్న అన్నమయ్య అద్భుత సారస్వతాన్ని బయటకు తీసి,పరిష్కరించి ప్రపంచానికి అందేలా చేసిన మహనీయుడు వేటూరి ప్రభాకరశాస్త్రి.ఆయన లేకపోతే,ఆ కృషి జరుగకపోతే అన్నమయ్యను లోకం మరి కొన్నాళ్ళు మర్చిపోయి ఉండేది.అన్నమయ్య సంకీర్తనా ప్రచార యజ్ఞంలో మొట్టమొదటగా స్మరించి,అంజలి ఘటించాల్సిన వ్యక్తి వేటూరి ప్రభాకరశాస్త్రి. స్మరణీయులలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ ద్వితీయులు. సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి స్థానం విశిష్టం.ఆ సంకీర్తనలను తొలిగా స్వరపరిచి జాతికి సమర్పించింది రాళ్లపల్లివారు. గౌరిపెద్ది రామసుబ్బశర్మ, మంగళంపల్లి, మల్లిక్, నేదునూరి కృష్ణమూర్తి,కామిశెట్టి శ్రీనివాసు మొదలైన వారు చేసిన సేవ సామాన్యమైనది కాదు. ఈ వరుసలో గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ వంటివారిని తప్పక చేర్చాలి.శోభారాజును తలచుకొని తీరాలి. 'అన్నమయ్య ప్రాజెక్టు' రూపకల్పనలో మూలస్థంభం చెలికాని అన్నారావు.టీటీడీలో అధికారిగా,ఛైర్మన్ గా ఆయన అందించిన సేవలన్నీ ఒక ఎత్తు –అన్నమయ్య ప్రచారం ఇంకా ఎత్తు.ఇందరు మహనీయుల సేవా విశేషంగా మనకు దొరికిన ఈ అపూర్వ సంపదను సద్వినియోగం చేసుకోవడంలో ఇంకా బలంగా ముందుకు సాగాల్సి ఉంది. అన్నమయ్య 32వేల కీర్తనలను రచించినట్లు చరిత్ర చెబుతోంది. అందులో ఇంతవరకూ సుమారు 12 వేలకు పైగా కీర్తనలు దొరికినట్లుగా చెబుతున్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి తనయుడు ఆచార్య ఆనందమూర్తి కూడా అన్నమయ్య ప్రచార యజ్ఞంలో పునీతులవుతున్నారు. ఆయన కూడా కొన్ని కీర్తనలను సేకరించి లోకానికి అందించారు. ఆనందమూర్తి సేవలను కూడా మనం సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోలేకపోయాం.ప్రస్తుతం వారు వృద్ధులై ఉన్నప్పటికీ, ఇంకా అన్నమయ్య కీర్తనలను సేకరించడం,లోకానికి అందించడంలో అలుపెరుగని సేవ చేస్తున్నారు.అన్నమయ్య తెలుగువాడి అక్షరసంపద, సంగీత సర్వస్వం. ఎన్నెన్నో పాటలు, పదాలు,కీర్తనలు ఆ కంఠం నుంచి ఆ గంటం నుంచి వెలువడ్డాయి. అవన్నీ అత్యంత విలువైనవి. గీత రచన –స్వరరచన ఏకకాలంలో నిర్వహించిన వాగ్గేయకార ప్రసిద్ధులలో అన్నమయ్యది విభిన్నమైన మార్గం. సంస్కృతభూయిష్టమైన పదాల పోహళి%శీ%పు ఎంత ఉంటుందో.. అచ్చతెలుగుపదాల పరిమళం అంతే ఉంటుంది. ఆనాటి రాయలసీమ,ముఖ్యంగా కడప జిల్లా మాండలిక పదాలే కాక, అప్పటి తెలుగు పదసంపద మొత్తం అన్నమయ్య పదాలలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. జనంభాష అంత విరివిగా రాసిన కవీశ్వరులు చాలా చాలా అరుదు. సకల వేదాల సారాన్ని, సర్వ మానవ సాగరాన్ని మథించి కీర్తనల రూపంలో అందించిన తత్త్వవేత్త.వేంకటేశ్వరుడిని స్తుతిస్తూ కనిపిస్తూనే జీవిత తత్త్వం మొత్తాన్ని మానవాళికి బోధించాడు. వైభవం –వైరాగ్యం రెండింటినీ అనుభవించినవాడు కాబట్టే అలతి అలతి పదాలలో అన్ని మర్మాలను అంత అందంగా, సులభంగా చెప్పాడు.కేవలం మానవాళియే కాదు,సర్వజీవుల పట్ల సమభావనతో జీవించాడు, జీవించమని చెప్పాడు. భక్తి రూపంలో మనిషికి గొప్ప శక్తిని అందించాడు. త్యాగయ్య, రామదాసు,క్షేత్రయ్య వంటి వాగ్గేయకార మహనీయులందరికీ గొప్ప ప్రేరణగా నిలిచాడు,వారి సంకీర్తనా ప్రస్థానానికి బంగారుబాటలు వేసిపెట్టాడు. పక్షిలో, జంతువులో, ప్రకృతిలో మనం నేర్చుకోవాల్సిన ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయని చాటి చెప్పాడు. అన్నమయ్య కీర్తన వింటే చాలు జ్ఞానం దర్శనమవుతుంది, జీవన మార్గం కనిపిస్తుంది. చందమామ రావె.. జాబిల్లి రావె.. అనే పాట తెలుగునాట బహుప్రసిద్ధం.అయితే,అది అన్నమయ్య రాశాడని చాలా తక్కువమందికి తెలుసు.ఇటువంటి జానపదాలు రాశాడు కాబట్టే జనపదాల్లో ఇప్పటికీ చిరంజీవిగా ఉన్నాడు. 'బ్రహ్మమొక్కటె –పరబ్రహ్మమొక్కటె' ఈ ఒక్క కీర్తన చాలు అన్నమయ్య సమతామమతను చాటిచెప్పడానికి. "నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటె... అంటనే బంటు నిద్ర అదియు నొకటె... కడగి ఏనుగు మీద కాయు ఎండొకటె... పుడమి శునకము మీద పొలయు ఎండొకటె " ఈ మాటలు చాలు అన్నమయ్య హృదయం ఏమిటో చెప్పేందుకు. "ఒకపరి కొకపరి వయ్యారమై.."అని ఆయనే అన్నట్లు ఒక్కొక్కమారు ఒక్కొక్క తీరులో పదకవితలు తెలుగులోకానికి అందించిన అన్నమయ్య అవతారపురుషుడు. తన సర్వ సారస్వతాన్ని, కవితాప్రతిభను దైవానికి, ఆ రూపంలో లోకానికి వెచ్చించాడు తప్ప,వ్యక్తిగత స్వార్థాలకు, కీర్తి,కాంత,కనకాలకు తాకట్టు పెట్టలేదు. "హరిని కీర్తించే నోటతో నరుని కీర్తించను" అని చెప్పిన ఆత్మాభిమాన ధనుడు. "బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్ కూళలకిచ్చి.. అప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్ హాలికులైన నేమి?" అన్నాడు పోతన్న కూడా. అన్నమయ్య గీతాలు ఏ రాగానికైనా,ఏ తాళానికైనా, ఏ బాణీకైనా ఒదిగిపోతాయి. జానపదంగా, లలితగీతంగా, భక్తి సంగీతంగా, శాస్త్రీయ కీర్తనగా పాడుకోవచ్చు, ఆడుకోవచ్చు.అంతటి ఒదుగు ఎదుగు ఉన్న కవితాశిల్పం అన్నమయ్యది.యశఃకాయుడైన అన్నమయ్య జననమరణాలకు అతీతుడు.అంతట తానై అగుపించే అనంతుడు.దొరికిన సారస్వతంలోని పదాల విశేషాలు,అర్థాలు, అంతరార్థాలు, పరమార్థాలు, సంగీత సాహిత్య మర్మాలు సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా రాయించి ప్రచారం చెయ్యాలి. అధ్యయనాలు,పరిశోధనలు పెద్దఎత్తున జరగాలి. ఈ బృహత్ బాధ్యతను టీటిడి సంపూర్ణంగా, సమగ్రంగా స్వీకరించాలి.అన్నమయ్య ప్రాజెక్టు ఇంకా చురుకుగా నడవాలి. ఆ మహనీయ సారస్వతానికి సరైన న్యాయం ఇంకా జరగాలి,జరపాలి. కొత్త ప్రభుత్వం ఆ దిశగా కదలాలి. వెంకటేశ్వరస్వామి భక్తుడుగా చెప్పుకొనే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మళ్ళీ అధికారం చేపట్టిన ఈ వేళలలో టీటీడీ ప్రక్షాళనలో భాగంగా అన్నమయ్య ప్రాజెక్టును కూడా ప్రక్షాళన చెయ్యాలి.

# ఇంటి పేరును మరుగుపరచిన వీరమాచినేని మధుసూదనరావు



బాల్యంలోనే తల్లిని కోల్పోయారు. స్కూలు ఫీజు కట్టే స్థోమత లేక చదువు మానేయమన్నాడు తండ్రి. పొలం పనులకు వెళ్ళారు. షోడాలు అమ్మారు. పూట గడవటం కష్టమై వారాల అబ్బాయిగా కుదిరి, పూటకో ఇంట్లో తింటూ చదువుకున్నారు. చిన్నతనం నుంచి నాటకాలపై పిచ్చి. అది ప్రజానాట్య మండలిలో గుర్తింపు తెచ్చింది. జీవిత భాగస్వామిని సమకూర్చి పెట్టింది. అష్టకష్టాలు పడి వ్యాయమ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగంలో చేరారు. తన వద్ద వ్యాయామ శిక్షణ పొందుతున్న విద్యార్థుల సహకారంతో సినీ ప్రముఖులతో పరిచయమైంది. సహాయ దర్శకునిగా పని చేసినందుకు నెలకు 100 రూపాయల జీతంతో సరిపెట్టుకున్నారు. 72 చిత్రాలకు దర్శకత్వం వహించారు. వాటిలో సగం పైగా శత దినోత్సవాలు జరుపుకోవటంతో 'విక్టరీ' వారింటి పేరై పోయింది. దర్శక ద్రోణాచార్యునిగా చరిత్రలో నిలిచారు వీరమాచినేని మధుసూదనరావు. మధుసూదనరావు 1923 జూన్ 14న జన్మించారు. కృష్ణాజిల్లాలోని ఈడుపుగల్లు వీరి జన్మస్థలం. తల్లి అన్నపూర్ణ, తండ్రి రామభద్రయ్య. అతి సామాన్య రైతు కుటుంబం వీరిది. విద్యాభ్యాసం ప్రారంభించిన కొద్ది రోజులకే, ఏడవ ఏటనే తల్లిని కోల్పోయారు. నాయనమ్మ పోషణలో పెరిగారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో పూర్తి చేసి ప్రాథమికోన్నత విద్యకు పునాదిపాడు చేరారు. మిడిల్ స్కూలులో ఫీజులు కట్టవలసి వచ్చింది. అందుకు డబ్బులు లేకపోవటంతో చదువు మానేయమన్నారు తండ్రి. ఆ వయసులో నెల రోజులు కూలి పనులకు వెళ్లి కొంత సమకూర్చుకునేవారు. తన కష్టంతోనే స్కూలు ఫీజులు కట్టి చదువు కొనసాగించేవారు. జన్మస్థలం ఈడుపుగల్లుకు హైస్కూలు విద్య చదువుతున్న పునాదిపాడుకు సుమారు అయిదు మైళ్ళ దూరం (ప్రస్తుతం 8 కిలోమీటర్లు). నడకతో రెండు గ్రామాల మధ్య ప్రయాణిస్తూ అవస్థలు పడేవారు. కొందరు దాతలు మధుసూదనరావుకు చదువు పట్ల ఉన్న శ్రద్ధను గమనించి పునాదిపాడులో పూటకో ఇంటిలో భోజనం పెట్టి చదువుకునే ఏర్పాట్లు చేశారు. అలా వారాల అబ్బాయిగా మారి హైస్కూలు విద్య పూర్తి చేశారు. అనంతరం గుంటూరు వెళ్లి హిందూ కళాశాలలో చేరి ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత మద్రాసు వెళ్లి వై.యం.సి.ఏ. కళాశాలలో చేరి వ్యాయమ శిక్షణ, ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి తర్వాత మద్రాసులోని రామకృష్ణ మిషన్ స్కూలులో వ్యాయమ ఉపాధ్యాయునిగా ఉద్యోగం లభించింది.విద్యార్థిగా కొనసాగే రోజుల్లోనే నాటకాల పిచ్చి ఏర్పడింది. స్నేహితులతో కలిసి నటించటం అలవాటయి ప్రజా నాట్యమండలి కార్యకలాపాలకు ఆకర్షితులయ్యారు. అదే కాలంలో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఒక చోట చదువు, మరో చోట నాటకాలు, ఇంకో చోట ఉద్యమాలు. ఇలా ఏక కాలంలో మూడు బాటల్లో పయనించారు మధుసూదనరావు. 1945లో 'ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్'కి జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. స్టూడెంట్ ఉద్యమంలో భాగంగా అతివాద సాహిత్యం పంపిణీ చేసినందుకు అరెస్టు కాబడి జైలు శిక్ష కూడా అనుభవించారు. వీరితో పాటు సరోజినీ అనే యువతి నాటకాల్లో వేషాలు వేస్తుండేది. అలా వారి పరిచయం పరిణయానికి కూడా దారి తీసింది. 1946లో సహ కళాకారిణి సరోజినిని వివాహమాడారు. అలా జీవితంలో స్థిరపడ్డారు. అటు తర్వాత రామకృష్ణ మిషన్ స్కూల్లో డ్రిల్లు మాస్టారుగా పని చేస్తున్న కాలంలో చలనచిత్ర దర్శకుడు యల్.వి. ప్రసాద్ కొడుకులు ఆనంద ప్రసాద్, రమేష్ ప్రసాద్ లిద్దరూ వీరి వద్ద వ్యాయామం నేర్చుకునేవారు. వారి ద్వారా యల్.వి. ప్రసాద్ తో పరిచయం ఏర్పడింది. యల్.వి. ప్రసాద్ దర్శకత్వం వహించిన "దాసి" చిత్రానికి పనిచేసే అవకాశం లభించింది. అటు తర్వాత కె.యస్. ప్రకాశరావు నిర్మించిన "కన్నతల్లి" చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేసి 100 రూపాయిలు జీతంగా అందుకున్నారు. చిన్ననాటి మిత్రుడు తాతినేని ప్రకాశరావు దర్శకత్వం వహించిన "పల్లెటూరు" (1952) చిత్రంలో చిన్న వేషం కూడా వేశారు మధుసూదనరావు. అప్పటికి చిత్రసీమలో గుర్తింపు పొందిన ఆదుర్తి, యల్.వి. ప్రసాద్ లాంటి వారి వద్ద పనిచేసి సినిమా నిర్మాణపు మెళకువలు ఆకళింపు చేసుకున్నారు. చదలవాడ కుటుంబరావు నిర్మించిన "సతీ తులసి" సినిమాకు మధుసూదనరావు 1959లో దర్శకత్వం వహించారు. చిత్రసీమలో గుర్తింపు అందుకున్నారు. సతీ తులసి ద్వారా 1960లో వి.బి. రాజేంద్రప్రసాద్ తన జగపతి ఆర్ట్స్ పిక్చర్స్ బ్యానర్ పై "అన్నపూర్ణ" చిత్రం నిర్మించటానికి సంకల్పించి, దానికి దర్శకత్వం వహించే అవకాశం మధుసూదనరావుకు అప్పగించారు. ఇంచుమించుగా అదే కాలంలో నందమూరి తారక రామారావు నటించిన "టాక్సీ రాముడు" చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య 1962లో నిర్మించిన "పదండి ముందుకు" చిత్రానికి దర్శకత్వం వహించిన మధుసూదనరావు ప్రతిభను వేనోళ్ళ చాటింది. రాష్ట్ర ప్రభుత్వం నుండి సబ్సిడీ పొందిన తొలి సినిమా పదండి ముందుకు. 1966లో మాస్కోలో నిర్వహించిన ఫిల్మ్ ఫెస్టివల్ లో కూడా ఈ సినిమా ప్రదర్శించబడి అంతర్జాతీయ స్థాయిలో బహుమతి అందుకుంది. అటు తర్వాత వెనక్కి తిరిగి చూసుకునే సమయం కూడా ఆయనకు దక్కలేదు. "రక్త సంబంధం", "గుడి గంటలు", "వీరాభిమన్యు", "లక్షాధికారి", "ఎదురీత", సూపర్ మేన్", "ఆరాధన", "ఆత్మబలం", "అంతస్తులు", "జేబుదొంగ", "జూదగాడు", "మంచి రోజులు వచ్చాయి","చక్రధారి", మనుషులు మారాలి", 'మల్లెపూవు", "కళ్యాణ మంటపం", "మానవుడు-దానవుడు" లాంటి సంచలన చిత్రాలకు దర్శకత్వం వహించారు. వీరు 72 చిత్రాలకు దర్శకత్వం వహించగా వాటిలో సగం శత దినోత్సవాలను జరుపుకోవటం విశేషం. వి. (వీరమాచినేని) మధుసూదనరావు పేరులో ఇంటిపేరు తెరమరుగై 'విక్టరీ' మధుసూదనరావుగా చరిత్రలో నిలిచిపోయారు. తమిళంలో శివాజీ గణేషన్ కథానాయకునిగా నటించిన "పాశమలర్" చిత్రాన్ని తెలుగులో "రక్త సంబంధం"గా యన్.టి.ఆర్. హీరోగా తెలుగు ప్రేక్షకులకు అందించారు. 'సాగరిక' అనే బెంగాలీ చిత్రాన్ని 'ఆరాధన" పేరుతో, 'తులాబారం' అనే మళయాళ చిత్రాన్ని "మనుషులు మారాలి" చిత్రాలుగా, హిందీ చిత్రం 'అమానుష్'ను తెలుగులో "ఎదురీత"గా అనువదించి 'రీమేక్ కింగ్' అనిపించుకున్నారు. ప్రసిద్ధ కన్నడ దర్శకుడు పుట్టన్న కణగల్ నిర్మించిన 'గజ్జె పూజె'ను తిలకించి, పులకించి స్వంత నిర్మాణ సంస్థను స్థాపించి "కళ్యాణ మంటపం" పేరుతో 1971లో తెలుగులో విడుదల చేశారు. వీరి సతీమణి సరోజిని అంతకు ముందే చిత్ర నిర్మాణరంగంలో కాలు మోపి, 1968లో "చిన్నారి పాపలు" అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని పాత్రధారులంతా మహిళలే కావటం విశేషం. ఈ చిత్రం నిర్మాణం వెనుక 'విక్టరీ' ప్రమేయం ఉంది. తెలుగుకే పరిమితం కాకుండా హిందీలో మూడు, కన్నడంలో రెండు, తమిళంలో ఒక సినిమాకు దర్శకత్వం వహించారు. విక్టరీ దర్శకత్వం వహించిన 'గుడి గంటలు', 'అంతస్తులు', 'ఆస్తిపరులు', 'ఆత్మీయులు', 'కథానాయకుడు', 'అమాయకురాలు', 'కాంచనగంగ' చిత్రాలకు నంది అవార్డులు లభించాయి. 1997లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. వీరి వద్ద శిష్యరికం చేసి దర్శకులుగా ఎదిగిన వారు 70 మందికి పైగా ఉంటారని ఒక అంచనా. తెలుగు నటులను తీర్చిదిద్దటం కోసం 1983లో "మధు ఫిలిం అండ్ టి.వి. ఇన్స్టిట్యూట్ ఆఫ్ యాక్టింగ్" సంస్థను స్థాపించిన మధుసూదనరావు 2012 జనవరి 11న కన్నుమూశారు.

–దాసరి ఆళ్వారస్వామి

# "రక్త దానం ఆరోగ్యానికి ప్రయోజనకరం"

అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టుమిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఎ,ఒ,బి, బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న "ప్రపంచ రక్త దాతల దినోత్సవము"ను ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపు కుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం యొక్క ఆవశ్యకతను తెలియ జేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచు కునేందుకు 2005లో ఈ కార్యక్రమం ప్రారంభమయింది. ఈ సందర్భంగా రక్తం అంటే ఏమిటి.. రక్తదానం ఎలా చేయాలి.. ఎవరు రక్తదానానికి అర్హులు.. రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం..రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడుతుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. అవి –ఎ.బి.ఎబి. ఒ అనే వర్గాలుగా విభజించాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్‌గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించా లనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండుగడ్డి రంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని "ప్లాస్మా" అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి.అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా




రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని "గ్రహీత" అని, ఇచ్చే వ్యక్తిని "దాత" అని అంటారు. ఒ గ్రూప్ రక్తం కలిగిన వారిని "విశ్వదాత" అని, ఎబి. గ్రూపుల రక్తం కలిగినవారిని "విశ్వ గ్రహీత" అని అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగ పడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చంటే...ఎబి. గ్రూప్ వారు ఎబి. గ్రూప్‌కి, ఎ. గ్రూప్ వారు, ఎబి. గ్రూపుల వారికి, బి గ్రూప్ వారు బి.ఎబి. గ్రూపుల వారికి, ఒ గ్రూప్ వారు ఎబి. ఎబి. ఒ గ్రూప్‌ల వారందరికి దానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే ఎబి. గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. బి. గ్రూప్ వారు బి.ఒ గ్రూపుల వారి నుంచి, ఎ.గ్రూప్ వారు ఎ.ఒ గ్రూపుల వారి నుంచి, ఒ గ్రూప్ వారు ఒ గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు.. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 3-4 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35 నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈ మూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హాని చేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది.ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని కాపాడడమే. ప్రతీ రెండు సెకన్లకు దేశంలో ఎక్కడోచోట ఒకరికి రక్తం అవసరమవుతుంది. ప్రతి రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. అత్యధికంగా కోరుకునే రక్తం "ఒ" గ్రూప్ దేశంలో ఏటా కొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్ బాధితులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూ వారికి రక్తం అవసరం ఉంటుంది.రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, సుమారుగా 1 యూనిట్ రక్తాన్ని దానం చేయవచ్చు. దాని వల్ల దాత శరీరానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య వంతుడైన దాత ప్రతీ 56 రోజులకు ఒకసారి ఎర్ర రక్తకణాలను డొనేట్ చేయవచ్చు. ఆరోగ్యవంతుడైన దాత కనీసం 7 రోజుల విరామంతో సంవత్సరానికి 24 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చు. రక్తం కోసం ప్రతిరోజు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. తలసేమియా లాంటి డేంజర్ వ్యాధిగ్రస్తులకైతే ప్రతి 15 రోజుల కోసారి బ్లడ్ ఎక్కించక పోతే బతకడం కష్టం. కనుక ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, సాటి మనుషులను బతికించుకుందాం.

- రామ కిష్టయ్య సంగనభట్ల

# జ్ఞానప్రదాత - హయగ్రీవుడు!!

విద్యకు అధిపతి హయగ్రీవుడుసాధారణంగా కష్టాలతో సతమతమైపోతున్న వారిని పలకరించినప్పుడు, ఇక ఆ భగవంతుడే చల్లగా చూడాలి అని అంటూ వుంటారు. అలా తన భక్తులను చల్లగా చూడటం కోసమే శ్రీ మహావిష్ణువు అనేక అవతారాలను ధరించాడు. అలాంటి అవతా రాల్లో 'హయగ్రీవావతారం' ఒకటి. పూర్వం హయగ్రీవుడు అనే రాక్షసుడు ఉండేవాడు. గుర్రం తలను కలిగిన హయగ్రీవుడు... బ్రహ్మదేవుడి గురిం చి కఠోర తపస్సు చేశాడు. తన ఆకారాన్ని పోలి నవారి చేతిలో మాత్రమే తన కి మరణం సంభవించేలా వరాన్ని పొందాడు. వర గర్వంతో హయగ్రీవుడు సాధు సత్పురుషులను నానార కాలుగా హింసించ సాగాడు. దాంతో దేవత లంతా ఆది దంపతులను శరణువేడారు. యోగ నిద్రలో వున్న విష్ణువును మేల్కొలిపితే ఆయనే హయగ్రీవుడిని సంహరిస్తాడని పార్వతీ దేవి వారితో చెప్పింది. శ్రీ మహావిష్ణువు తన విల్లు చివరి భాగాన్ని గెడ్డంకింద పెట్టుకుని నిద్రిస్తున్నాడు. ఆయనను మేల్కొల్పడం కోసం శివుడు చెద పురుగుగా మారి వింటి తాడును తెంపాడు.వింటి తాడు తెగిన కారణంగా విల్లు పైకి ఎగదన్నడంతో శ్రీ మహావిష్ణువు తల... శరీరం నుంచి వేరై పోయింది. ఆయన ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న ఆది దంపతులు గుర్రం తలను తెప్పించి శ్రీ మహావిష్ణువు దేహానికి అమర్చారు. అమ్మవారితో సహా దేవాధి దేవతలు తమ జ్ఞానాన్ని ... శక్తి సామర్థ్యాలను గుర్రం తల గల శ్రీ మహావిష్ణువుకి ధారపోశారు. కారణంగానే హయగ్రీవ స్వామి విద్యలకు అధిపతిగా జ్ఞానప్రదాతగా పూజలు అందు కుంటున్నాడు. తన అవతార కార్యాన్ని నెరవేర్చిన స్వామి లక్ష్మీ సమేతుడై దేవతలకు దర్శనమిచ్చాడు. స్వామివారు ఈ అవతారాన్ని ధరించిన రోజు శ్రావణ పౌర్ణమి. ఈ రోజున లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామిని పూజించడం వలన విద్య - విజ్ఞానం లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. విద్యార్థులకు జ్ఞానప్రదాత గుర్రం శిరస్సును పొందిన నారాయణుడుకి సమస్త దేవతలు తమ జ్ఞాన శక్తిని ధారపోస్తారు. దాంతో హయగ్రీవుడనే అసురుడిని సంహరించిన స్వామి వేదాలను కాపాడతాడు. అసుర సంహారం అనంతరం స్వామివారిని లక్ష్మీదేవి శాంతింపజేస్తుంది. నారాయణుడు ... హయగ్రీవుడిగా అవతరించిన ఈ రోజున ఎవరైతే లక్ష్మీ సమేతుడైన హయగ్రీవుడిని ఆరాధి స్తారో, వాళ్లకి జ్ఞానసిద్ధి కలిగి విద్యయందు రాణిస్తారనీ ... విజయంతో పాటుగా సంపదలను పొందుతారని సాక్షాత్తు జగజ్జనని అయిన పార్వతీదేవి పలుకుతుంది. ఆ



రోజు నుంచి హయగ్రీవుడు జ్ఞానాన్ని ప్రసాదించే దైవంగా పూజాభిషేకాలను అందుకుంటున్నాడు. అందువలన విద్యార్థులు తప్పనిసరిగా హయగ్రీవస్వామిని ఆరాధిస్తూ వుండాలి. ఆయన అనుగ్రహంతో అభివృద్ధిని సాధిస్తూ వుండాలి.

**" జ్ఞానానంద మయం దేవం, నిర్మలాస్ఫటికాకృతమ్**
**ఆధారం సర్వ విద్యానాం, హయగ్రీవ ముపాస్మహే"** జ్ఞానం, ఆనందం, మూర్తీభవించిన దైవస్వరూపం హయగ్రీవుడు. నిర్మలమైన స్ఫటికాకృతి కలిగి సర్వవిద్యలకు ఆధారభూతమైన విద్యాధిదేవత హయగ్రీవునకు నమస్కారము. ఈ హయగ్రీవావతారం కూడా మహావిష్ణువుదే. ఒకసారి ఓ రాక్షసుడు తన లాంటి వాడితోనే తనకు మరణం సంభవించాలని కోరుకుంటే ఆ దానవుడి కోరిక తీర్చటానికి మహావిష్ణువు హయగ్రీవావతారు డయ్యాడని ఓ కథనం. ఓ సారి మహా విష్ణువు దానవులతో పోరు సల్పి చాలా అలసిపోయ తన చేతిలోని ధనస్సునే ఆధారం చేసుకొని నిద్రపోయాడు. నిద్రాదేవి ఒడిలో సేదతీరుతున్న మహావిష్ణువును మేల్కొపడానికి ఏ హేతువు కన్పించక ఇంద్రాది దేవతలు చెదపురుగును ధనస్సుకున్న అల్లెత్రాడును కొరకమన్నారట. ఆ శబ్దం వల్ల మహావిష్ణువు మేల్కొంటాడన్న ఆశతో. కానిచెదపురుగు కొరుకుడు వల్ల మహావిష్ణువుకు నిద్రాభంగమేకాక కంఠం కూడా తెగిపోయింది. ఇక అపుడు ఏమి చేయాలో తోచక పరాశక్తిని వేడుకొంటే ఆ తల్లి అశ్వముఖాన్ని మహావిష్ణువుకు అతికించమని చెప్పిందట. ఆ అమ్మచెప్పినట్టుగా దేవతలు చేయగా హయగ్రీవవతారుడయనాడు మహావిష్ణువు.

**సరస్వతికి గురువు:...** సరస్వతీదేవి, వేదవ్యాసుడు హయగ్రీవుని నుండి విద్యాశక్తిని సముపార్జించారని హయగ్రీవ స్తోత్రంలో దేశికాచార్యులు పేర్కొన్నారు. హయగ్రీవోపాసన వాక్శక్తిని, విద్యాశక్తిని, జ్ఞానశక్తిని సిద్ధింప చేస్తుంది. అందుకే శుద్ధ పూర్ణిమనాడు హయగ్రీవారాధన విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. హయగ్రీవోపాసన చేసిన వారికి సకలవిద్యలూ కరతలామలకం అవుతాయ. విశ్వశ్రేయోదాకమైన వేదాలను రాక్షసుల చేతిలో పడనీయక హరియే హయగ్రీవునిగా అవతరించిన ఈ రోజు మనం కూడా హయగ్రీవుని పూజించి ధర్మ సంస్థాపనకు మనవంతు చేయూతనిద్దాం.తన అవతార కార్యాన్ని నెరవేర్చిన స్వామి లక్ష్మీ సమేతుడై దేవతలకు దర్శనమిచ్చాడు. స్వామివారు ఈ అవతారాన్ని ధరించిన రోజు శ్రావణ పౌర్ణమి. ఈ రోజున లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామిని పూజించడం వలన విద్య - విజ్ఞానం లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

–సేనాధిపత్యం రమేష్

# అభివృద్ధి వ్యూహాల అమలుకు కృషి చేయాలి

- లక్ష్యాల సాధనకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ)పై అధికారులతో కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి వ్యూహాలను ప్రణాళికాయుతంగా అమలు చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని.. ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులకు సూచించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్చువల్ సమావేశానికి కలెక్టర్ డిల్లీరావు.. అధికారులతో కలిసి ఆర్ అండ్ బీ భవంతిలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి, అమలుచేసిన ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం (ఏడీపీ) మంచి ఫలితాలు ఇవ్వడంతో గత అక్టోబర్‌లో 100 ఆకాంక్షిత బ్లాకులను ఎంపిక చేయడం జరిగింది. ఈ జాబితాలో ఎన్‌టీఆర్ జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆకాంక్షిత బ్లాక్‌లలో వివిధ సూచికల్లో ప్రగతిపై నీతి ఆయోగ్ సీఈవో మార్గనిర్దేశనం చేశారు. ముఖ్యంగా మహిళా, శిశు ఆరోగ్యం, పోషణకు సంబంధించిన ఆరు సూచికల్లో జులై చివరి నాటికి 100 శాతం పురోగతి సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో సామాజిక, ఆర్థిక సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అయిదు కేటగిరీలకు సంబంధించి ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, అనుబంధ రంగాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళిత రంగాల్లో మొత్తం 40 సూచికల్లో ప్రగతిని నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు మదించడం జరుగుతుందన్నారు. అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ సూచికల్లో ప్రగతిని కనబరచొచ్చని.. ఇందుకు విద్య, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం, ఆసుపత్రుల్లో ప్రసవాలు, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్, ఐసీడీఎస్ కార్యక్రమాల ద్వారా పోషకాహారం పంపిణీ తదితర సూచికలపై దృష్టిసారించాలన్నారు. వర్చువల్ సమావేశంలో పెనుగంచిప్రోలు ఎంపీడీవో సాయి హర్ష, ఈవో (పీఆర్ అండ్ ఆర్‌డీ) ఎం.వరప్రసాద్, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యం

**నూజివీడు జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్ర మంత్రివర్గంలో ఏలూరు జిల్లా నుంచి మంత్రిగా ఎన్నికైన నూజివీడు శాసనసభ్యులు కొలుసు పార్ధసారధి గురువారం ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి మొట్ట మొదటి సారిగా విచ్చేసిన సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికిన ఏలూరు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణ, చింతలపూడీ శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీకృష్ణ, మరడాని రంగారావు, మరియు ఇతర ముఖ్య నాయకులు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలలనుంచి వచ్చిన కార్యకర్తలు నాయకులు పార్ధసారధిగారిని ఘనంగా సన్మానించారు.అనంతరం ఏలూరు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో పార్ధసారధి మాట్లాడుతూ ప్రజాతీర్పులో వైసిపి కొట్టుకు పోయింది. చంద్రబాబు నాయుడే రాష్ట్రాన్ని నిలబెట్టగలరు అని నమ్మి ప్రజలంతా ఎన్ డి ఏ కూటమికి పట్టంకట్టారు. అవినీతి అరాచకం వేధింపులతో ప్రజలకు ఊరట లభించింది అని అన్నారు. జిల్లాలో 7 సీట్లకు 7 సీట్లు గెలిపించి ఆదరించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మీరంతా మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా భాద్యత అని అన్నారు.

# గొల్లపల్లి హైస్కూల్లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**నూజివీడు జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో క్రొత్త విద్యా సంవత్సరము మొదటి రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 2024 సంధర్భముగా న్యూఢిల్లీ లోని బుద్ధ జయంతి పార్క్ లో పీపాల్ చెట్టు మొక్కను నాటడం ద్వారా ప్రధాన మంత్రి ప్లాంట్ 4 మదర్ ప్రచారాన్ని ప్రారంభించారు. అదే సందర్భంగా స్కూల్ లో మొక్కలను నాటే కార్యక్రమం జరిగిందని స్కూల్ హెచ్ఎం తెలిపారు. భూమాత ద్వారా ప్రకృతిని పెంపొందించడం మరియు మన తల్లులు మానవ జీవితాలను పోషించడం మధ్య సమాంతరాన్ని గీయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ప్రేమ గౌరవము మరియు గౌరవానికి గుర్తుగా ఒక చెట్టును నాటాలని ఉద్బోధించారు. తల్లులు మరియు చెట్ల రక్షణ కోసం ప్రతిజ్ఞ కూడా నిర్వహించుకోవాలి.ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ లను చేపట్టేటప్పుడు పిల్లలు తాము నాటిన చెట్లకు వారి తల్లి పేరు పెట్టమని చెప్పవచ్చుప్రకృతి నడకలు ప్లాంటేషన్ మరియు క్షేత్ర సందర్శనలు వంటి ఇతర కార్యకలాపాలను నిర్వహించవచ్చును.అమ్మ లాగా మొక్కను సంరిక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుని పి. రాధికా రాణి ఉపాధ్యాయులు రవీంద్ర, కృష్ణవేణి ,మల్లేశ్వరి ,సౌజన్య, మనోహరము, లక్ష్మి, కోటేశ్వరమ్మ, విఠల్ బాబు, రవి,రంగారావు, బాలు, మోహన్ రావు నాన్ టీచింగ్ సిబ్బంది ధనలక్ష్మి ,రవి, మరియమ్మ ,నారాయణ పాల్గొన్నారు.

# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుంది

## బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ.!



**మచిలీపట్నం జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని తుంగలోకి తొక్కి ఏకపక్షంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రద్దుచేసిన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ న్యాయ వాదులందరూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు అని మచిలీప ట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ రద్దుపై రెండవ సంతకం చేసిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ చట్టంరద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లు న్యాయవాదులు రెండు నెలలకు పైగా విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహించడం జరిగిందని బాలాజీ గుర్తు చేశారు. నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి న్యాయ వ్యవస్థ గౌరవ ప్రతిష్టలను పెంచారన్నారు .చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాబోయే రోజుల్లో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని అందుకు న్యాయవాదు లందరూ సంపూర్ణ సహకారాలు అందిస్తారని బాలాజీ తెలియజేశారు. గత ప్రభుత్వంలో ఏకపక్షంగా నియమితులైన లా ఆఫీసర్లను కూడా తక్షణమే తొలగించి నిజాయితీ అనుభవం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ని ప్రభుత్వ న్యాయవా దులను నియమించాలని బాలాజీ తెలిపారు.మచిలీపట్నం నుండి తరలిపోయిన న్యాయస్థానాలను తిరిగి జిల్లా ముఖ్య కేంద్రం కివచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు.

# వల్లభనేని బాల సౌరిని మర్యాదపూర్వకంగా కలిసిన పెడన మున్సిపల్ చైర్ పర్సన్



**పెడన 13 జూన్ (ఆంధ్రపత్రిక) :** బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాల సౌరి ని మర్యాదపూర్వ కముగా కలిసి పుష్పగుచ్ఛం సమర్పించి, శాలువాతో సత్కరించిన పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్, ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మెట్ల దుర్గా నాగేశ్వరరావు (చిన్న) 4 వార్డు వైసిపి ఇన్చార్జ్ హుమాయున్ ,6వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యూం (బాబూలాల్) , 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు ,18వ వార్డ్ ఇంచార్జ్ కోమట్ల అనిల్ కుమార్ , 20వ వార్డు ఇంచార్జ్ కొసనం సత్యనారాయణ (అభిరామ్ మాస్టర్) ,21వ వార్డు పిచ్చిక సతీష్ బాబు , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కటకం నాగ కుమార్ ,మరియు గ్రంథాలయ కమిటీ చైర్మన్ రౌతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్ధసారదికి మంత్రి పదవి రావడం హర్షనీయం

### మాజీ ఏ ఎం సి ఛైర్మెన్ : కాపా శ్రీనివాసరావు



**నూజివీడు జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గం నుంచి మొట్ట మొదటిసారి తెలుగుదేశం ప్రభుత్వంలో ఎంఎల్ఏగా గెలిచిన కొలుసు పార్ధసారథికి మంత్రి పదవి రావటం మాకు ఆనంద దాయకం అని, పార్టీ పెట్టిన గత 40 సంవత్సరాలలో 5 సార్లు పార్టీ అభ్యర్థులు నెగ్గిన మొదటిసారి మంత్రి గా సారథి గారు ఎన్నికయ్యారు అని, మంత్రి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు సీనియర్ నాయకులు కాపా శ్రీనివాసరావ మరియు నియోగకవర్గంలో 87 గ్రామాలలో సుమారు 71 గ్రామాలలో సారథికి స్పష్టమైన మెజారిటీ వచ్చింది మరియు టౌన్లో 30 వార్డు లలో 28 వార్డులలో మెజారిటీ ఇచ్చి ప్రజలు ఆశీర్వదించారు అని తెలియజేశారు. మెట్ట వ్యవసాయం మీద ఆధారపడిన ఈ నూజివీడు నియోజకవర్గంకు మంత్రి పదవి రావటంతో మేము అంత కలసి ఈ నియోజకవర్గంను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా చేసేందుకు శతవిధాలా కృషి చేస్తాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి వైకాపా అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలి

### అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు బాలకోటయ్య వ్యాఖ్య



**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహించి ముందుగా వైకాపా పార్టీ శాశ్వత అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య సూచించారు. గురువారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయత, విలువలు, ధర్మం అంటూ ప్రవచనాలు చెప్పే జగన్ కు రాజీనామా చేయక పోవటం ఏ విలువలకు, ఏ విశ్వసనీయ తకు ఆదర్శనీయం అని ప్రశ్నించారు. ప్రజలు నమ్మి ఇచ్చిన 151 సీట్లును 11 సీట్ల స్థితికి తీసుకురావడానికి కారణం ఆయన కాదా? అన్నారు. మళ్ళీ పాపం పండుతోంది. కళ్ళు మూసుకుంటే ఐదేళ్ళు గడిచిపోతాయి అని వైకాపా ఎమ్మెల్సీలకు నీతులు చెప్పటం దెయ్యాలు వేదాలు, ఉపనిషత్తులు వల్లించినట్లుగా ఉందన్నారు. పాపం పండే వైకాపా పీడ తొలగిందని, ప్రజలు కళ్ళు తెరిచారు కాబట్టే, రెండు ఒకట్ల నామాలను బహుకరించారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఎక్కడో తెలియకుండా పాలన ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి నోట అమరావతి మాట రానంత వరకు ఆయన ఏది మాట్లాడినా సత్య దూరం అవుతోందని, వైకాపా నాయకులు కూడా ఆయన హితవు వినరని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు.

# ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు గురుకుల సిబ్బంది సన్మానం



**అవనిగడ్డ 13 జూన్ (ఆంధ్రపత్రిక) :** అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌ని అవనిగడ్డ మండలం పులిగడ్డ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. గురువారం అవనిగడ్డలో బుద్ధప్రసాద్‌ని, ఆయన తనయుడు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్‌ని గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నాలుగోసారి అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపు సాధించటంతో పాటు అత్యధిక మెజారిటీ సాధించిన బుద్ధప్రసాద్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

# సారథికి మంత్రి పదవి : సిపిఐ హర్షం

**నూజివీడు జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గ నూతన శాసనసభ్యునిగా ఎన్నికైన కొలుసు పార్థసారథి కి రాష్ట్ర ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రి హోదా కల్పించడం పట్ల సిపిఐ నూజివీడు నియోజకవర్గ సమితి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. గతంలో నూజివీడు నుండి మంత్రులుగా ఎమ్మార్ అప్పారావు గారు పాలడుగు వెంకట్రావు పనిచేశారని ఆ తరువాత దీర్ఘకాలం తరువాత నూజివీడు శాసనసభ్యుని మంత్రిగా తీసుకోవడం హర్షదాయకం అని పేర్కొన్నారు. దీనివలన నూజివీడు ప్రాంతంలో నిలిచి పోయిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు సత్వరంగా పూర్తి చేయడానికి, నియోజకవర్గం లో పేదల సాగులో ఉన్న పదివేల ఎకరాల అటవీ బంజరు భూములకు హక్కులు కల్పించేందుకు, నూజివీడు పట్టణ సమగ్రాభివృద్ధి లో భాగంగా రింగ్ రోడ్డు ఏర్పాటు, చిట్కోయిల్లో పనులు పూర్తి చేయడం వంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని, ఆ దిశగా నూతన మంత్రిగా ఎన్నికైన పార్థసారథి ప్రయత్నం చేయాలని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావులు, నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల. పుల్లారావు ఒక ప్రకటనలో మంత్రి పార్థసారధిని అభినందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

# పశ్చిమ నియోజకవర్గంలో ప్రజాసమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి

### పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు : జూన్ 13 (ఆంధ్రపత్రిక) గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత 5ఏళ్ళ నుండి ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కుంటున్నారని, వీటిని అత్యవసరంగా గుర్తించి, పరిష్కార దిశగా మునిసిపల్ అధికారులు కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. గురువారం తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన మునిసిపల్ అధికారాలతో మాధవి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో తన దృష్టికి వచ్చిన పలు ప్రజాసమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసరంగా పరిష్కారించాలని సూచించారు. అదేవిధముగా గుంటూరు ఎ.టీ అగ్రహారంలో 14వ లైన్ లో కలుషితనీరు సరఫరా అవుతుందని తనను ఈ రోజు కలిసిన ప్రజలు,తన దృష్టికి తీసుకొనివచ్చారన్నారు. గతంలో మున్సిపల్ మంచి నీటి లైన్లలో కలుషిత డ్రైనేజి కలిసి అనేకమంది ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యారని,దురదృష్టవశాత్తు కొంతమంది మరణించారని మాధవి గుర్తు చేసారు. ఇప్పుడు అలాంటి నిర్లక్ష్యాలు జరగటానికి వీలులేదని, వెంటనే దీనిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కారం లభించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అనంతరం పలువురు అధికారులు, రాజకీయ నాయకులు గళ్ళా మాధవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి, పలువురు నేతలు, అధికారులు ఉన్నారు.

# బాపట్లలో ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు



**బాపట్ల జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు సందర్భంగా ఎం.వి. సుధాకర్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష అధికారి గురువారం మొక్కలు నాటడం జరిగింది. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పు లను, దాని వలన కలిగే నష్టాలను, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజ నాలు గురించి వివరించారు. 13 నుంచి 19వ తేదీ వరకు రోజువారి నిర్వహించవలసిన కార్యక్రమం గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓలు:ఎస్. నిరంజన్, డి.ప్రసాదరావు, బి.రాజశ్రీ ప్రధానోపాధ్యాయు రాలు, పిడి.కె. శ్రీనివాసరావు, పి ఈ టి, రవికుమార్,ఆడే బుజ్జి,బ. టి. శ్రీనివాసరావు , టి. మాణిక్యాలరావు పాల్గొన్నారు.

# భారతీయ మార్కెట్లో షవోమీ 14 సివి



**విజయవాడ, జూన్ 13 (ఆంధ్ర పత్రిక) :** టెక్నాలజీ, ఆవిష్కరణలలో గ్లోబల్ లీడర్ షవోమీ, తన షవోమీ 14 సిరీస్‌కి అద్భుతమైన చేరికగా, షవోమీ 14 సివిని విడుదల చేసింది. లైకా కో-ఇంజనీరింగ్‌తో తయారైన, షవోమీ 14 సివి మొబైల్ ఇమేజింగ్, స్మార్ట్‌ఫోన్ ఫోటోగ్రఫీలో షవోమీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతుంది. షవోమీ 14 సివి కెమెరా పనితీరును రెట్టింపు చేస్తుంది. అలాగే, షవోమీ 14 సిరీస్ ఐకానిక్ డిజైన్ లాంగ్వేజ్‌ను వారసత్వంగా అందుకుంటూ, ఫ్లాగ్‌షిప్ సెగ్మెంట్‌లో గణనీయమైన పరిణామాన్ని సూచి స్తుంది. అత్యాధునిక ఆవిష్కరణలను అందరికీ అందుబాటులో ఉంచడంలో షవోమీ కొనసాగిస్తున్న నిబద్ధతను ఇది ప్రదర్శిస్తుంది.


**శ్రీ శోభనాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్ల వేదపాఠశాల**
**ఆగిరిపల్లి గ్రామం**
**దేవదాయ ధర్మాదాయ శాఖ**
**భూమి కౌలు హక్కు వేలం ప్రకటన**

అగిరిపల్లి గ్రామములో గల శ్రీ శోభానాద్రి లక్ష్మీనరసింహ స్వామి వార్ల వేదపాఠశాల తాలూకా దిగువ నుదహరించిన పల్లం భూమికి 3 సంవత్సరముల కాల పరిమితి అనగా 14/7/2024 నుండి 13/07/2027 వరకు లీజుకు ఇచ్చుటకు అధికారుల సమక్షంలో బహిరంగ వేలం

**షెడ్యూల్**

| వివరము | తేదీ సమయం వేలం నిర్వహించు ప్రదేశం | ధరావత్తు సొమ్ము | సాల్వేన్సీ |
|---|---|---|---|
| 371/5లో ఎ 2.02సె. పెద్దఅవుటపల్లి గ్రామం | ది.24.6.24 ఉ-11-00 గం..లకు పెద్దఅవుటపల్లి గ్రామం సచివాలయం వద్ద | రూ..5,000/- | రూ..2,00,000/- కిమ్మత్తు |

1. ఇతర పాట షరతులు నియమ నిబంధనలు కార్యలయం నందు గాని ఫోన్ ద్వారా గాని 9440326258 తెలుసుకొనవచ్చును.

కార్యనిర్వహణాధికారి

# వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



- విలువలతో కూడిన విద్య ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధి
- పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషిచేయాలి
- వసతి గృహాలపై సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విజయవాడ, జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని.. విలువలతో కూడిన విద్య ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు.గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో ప్రవేశాలు, బోధన, నిర్వహణ, గత పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు తదితరాలపై చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో ప్రవేశాలు జరిగేలా చూసి.. నాణ్యమైన బోధన అందించేందుకు, వసతి కల్పించేందుకు అనువుగా వసతి గృహాలను తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ప్రి మెట్రిక్ 25, పోస్ట్ మెట్రిక్ 13 వసతి గృహాల్లో 2,095 మంది విద్యార్థులకు అవకాశముందని.. మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. కెరీర్ పరంగా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేలా నైపుణ్యాలను అందించాలన్నారు. గత పరీక్షల్లో ఫలితాలను విశ్లేషించుకొని ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్ది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సిబ్బంది కృషిచేయాలన్నారు.

విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విలువలతో బయటకు వచ్చినప్పుడు వారి తల్లిదండ్రులకు కలిగే ఆనందం వర్ణనాతీతమని పేర్కొన్నారు. సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో ఆయా అంశాలపై పట్టు సాధించేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల పురోగతిని విశ్లేషించి.. వారిని సరైన విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడి మంచి ఆహారాన్ని అందించాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. తరచు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ డీడీ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్, సూపరింటెండెంట్ ఎ.ఆంజనేయులు, సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహపు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



# వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

## నగర కమిషనర్ కీర్తి చేకూరి



**గుంటూరు ప్రతినిధి, జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, డివిజన్ల వారిగా ఏఈ, శానిటరీ ఇన్స్పెక్టర్లు భాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా మెడికల్ క్లబ్, నల్ల చెరువు, బుడంపాడు బై పాస్, కాకాని రోడ్ రిలయన్స్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రైన్లలో జరుగుతున్న పూడిక తీత పనులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షం నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. వర్షాలకు ఎక్కడైనా నీరు నిలిస్తే ఆయా అధికారులే భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నగర పరిధిలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లలో ఇప్పటికే పూడిక తీత పనులు జరుగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు ప్రారంభించడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఆక్రమణలు ఉంటే వెంటనే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలన్నారు. పూడిక తీత పనులను ఎమినిటి కార్యదర్శులు దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని, పూడిక తీతకు ముందు, తర్వాత ఫోటోలు తీయాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో స్థానికుల సంతకాలు తీసుకోవాలని, డ్రైన్ పూర్తి డెప్త్ వరకు పూడిక తీయాలన్నారు.

పనుల వివరాలతో మ్యాప్ సిద్దం చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. అనంతరం ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులపై మరింత శ్రద్ధ పెట్టాలని, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. ప్రదానంగా ఎక్కడా గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, వ్యర్థాలు రోడ్ల మీద, డ్రైన్లలో వేయకుండా వీధి వ్యాపారులకు తెలియ చేయాలన్నారు. షాప్స్ ఎదుట డస్ట్ బిన్లు పెట్టుకోవాలని, లేకుంటే వారికి అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. శ్యాం సుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి, శ్రీనివాస్, ఏసిపి మురళి, ఎస్.ఎస్. లు ఆనందకుమార్, రాంబాబు, ఆయుబ్ ఖాన్, డిఈఈలు రమేష్ బాబు, రాము, శ్రీధర్, ఏఈలు, టిపిఎస్ లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఉద్యోగార్థులందరిలో సాధించాలనే

# లక్ష్యమే ఏకైక ధ్యేయంగా ఉండాలి

**- ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ వడ్లమాని రవి**



**గుంటూరు, జూన్ 13 (ఆంధ్రపత్రిక)** ఉద్యోగాల పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులందరూ అనుకున్నది సాధించాలనే ఏకైక లక్ష్యమే ధ్యేయంగా ఉండాలని ప్రముఖ రొటేరియన్, చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ వడ్లమాని రవి అన్నారు. బుధవారం ఉదయం పెదకాకాని మండలం, వేనీగండ్ల గ్రామ శివారులోని కౌండిన్య పురంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగాల శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ సభలో డాక్టర్ వడ్లమని రవి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ వడ్లమాని రవి ప్రసంగాన్ని కొనసాగిస్తూ మనం ఎక్కడ పుట్టాం ,ఎవరికి పుట్టాం అన్నది కాకుండా ముఖ్యంగా ఎలా పెరిగాం, ఏలా ఎదిగా, ఏ స్థాయికి చేరామన్నదే ముఖ్యమన్నారు. అందుకే అందరూ ఎంతో కష్టమైన, మనం అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలో లక్ష్యాన్ని పెట్టుకుంటే అనుకున్న స్థాయికి ప్రతి ఒక్కరం చేరవచ్చునన్నారు. మదర్ తెరిసా వంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మన లక్ష్యం, మంచిది, సరైనది న్యాయబద్ధమైనది, అయితే ప్రకృతి కూడా సహకరించి మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. ముందు మన మీద మనకు నమ్మకం ఉంటే మనదే విజయం అవుతుందన్నారు. ఏ పని చేసిన, ఏ పరీక్షకు ప్రిపేర్ అయిన చిత్తశుద్ధితో సాధించారనే లక్ష్యంతో చేసినప్పుడు తప్పక విజయం శిఖరాలను చేరతామన్నారు. సభలో పాల్గొన్న కౌండిన్యఐఏఎస్ అకాడమీ అకాడమిక్ డీన్, కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత జాయింట్ కమిషనర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ మనిషికి ఏ రంగంలోనైనా విజయమే ముఖ్యమని ఆ విజయం ఆనందాన్ని ఇస్తుందని అప్పుడే జీవితంలో సుఖశాంతులు ఉంటాయన్నారు. ఉద్యోగాల పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ముందు జ్ఞానం పొందే పరిస్థితులను ఏర్పరచుకొని ఆ జ్ఞానాన్ని నైపుణ్యతగా మార్చుకొని, సానుకూల దృక్పథంతో ప్రణాళిక బద్ధంగా శ్రమించిన వారే విజయ శిఖరాలను చేరతారన్నారు. బ్యాంకు ఉద్యోగాలలో ఎన్నో స్థాయిల ఉద్యోగాలు ఉన్నాయని, ఏ స్థాయి ఉద్యోగమైనా సాధించే నైపుణ్యతను సంపాదించు కోవాలన్నారు. ఎంతో అనుభవం గల నిపుణులైన, అధ్యాపకులు ఎంతో శ్రమకోర్చి ఇక్కడకు వస్తున్నారని, వారి ఏర్పాట్ల కోసం కౌండిన్యఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక వ్యవస్థాపకులు ఎంతో ధనాన్ని, సమయాన్ని వెచ్చిస్తున్నారని అభ్యర్థులు క్రమశిక్షణతో తరగతు లకు హాజరై ఉద్యోగార్థులుగా మారడమే మా లక్ష్యమన్నారు. సభలో పాల్గొన్న టోబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నటువంటి సదుపాయాలు అప్పుడు మాకు ఏమీ లేవని, అయినా కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించామన్నారు. అయితే ఇప్పటి వారికి కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ,కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వంటి సంస్థలు ఆర్థికపరంగా, శిక్షణా పరంగా ఎంతో సహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. అభ్యర్థులు కష్టపడితే అందరూ ఉద్యోగాలు సాధించవచ్చునన్నారు. సభాధ్యక్షులు ఇవి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ఒక కుటుంబం, సమాజం అభివృద్ధి ఒక విద్యా, ఉద్యోగాల పైనే ఆధారపడి ఉంటుందనే ప్రధాన ఉద్దేశంతోనే కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ లను స్థాపించామన్నారు .వసతులకు ఏమాత్రం లోటు లేకుండా బోధనాపరమైన నైపుణ్యత కలిగిన అధ్యాపకులతో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళ అభ్యర్థులను ప్రోత్సహించాలని వారికి కొందరి స్పాన్సర్స్ సహకారంతో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు ఎవరైనా కౌండిన్యఐఏఎస్ అకాడమీ సేవల్ని, సదుపాయాలను వినియోగించుకోవచ్చు అన్నారు. కేవలం అధ్యాపకుల ఖర్చులు, నిర్వహణ చార్జీలను మాత్రమే ఫీజుగా స్వీకరించడం జరుగుతుందన్నారు. సభలో న్యాయమూర్తి దాసరి బాలకృష్ణ, అధ్యాపకులు కోటేశ్వరరావు, అమర్నాథ్, అరుణ కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాకా రాంగోపాల్ గౌడ్ అతిథులను వేదిక మీద ఆహ్వానించారు.

### నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవంలో..

## జనతా పార్టీ అధ్యక్షుడు నవనీత్ చతుర్వేది




**విజయవాడ, 13 జూన్ (ఆంధ్రపత్రిక) :** తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అతిరధ మహారథులు విచ్చేశారు. అందులో జనతా పార్టీ అధ్యక్షుడు నవనీత్ చతుర్వేది కూడా ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి జేపీ నడ్డా హాజరయ్యారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, తెలంగాణ బీజేపీ నేత కిషన్ రెడ్డి, రాందాస్ అథవాలే, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, నితిన్ గడ్కరీ, అనుప్రియా పటేల్, మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ షిండే, నటులు చిరంజీవి, రజనీకాంత్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. విజయవాడ విమానాశ్రయంలో రాష్ట్ర ప్రోటోకాల్ ప్రకారం నవనీత్ చతుర్వేదికి స్వాగతం పలికారు. విదేశీ దౌత్యవేత్తలకు ప్రత్యేకించబడిన అత్యంత విశిష్టమైన ఏఏఏ కేటగిరీలో చోటు కల్పించారు. చంద్రబాబునాయుడు గత హయాంలో ఏపీ ఇంటెలిజెన్స్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు వద్ద రాజకీయ సలహాదారుగా నవనీత్ చతుర్వేది పనిచేశారు. డిసెంబర్ 2022లో జనతా పార్టీ అధ్యక్షుడు అయినప్పటి నుంచి చతుర్వేది వివిధ హోదాల్లో నాయుడు తిరిగి రావడానికి చురుకుగా మద్దతునిస్తూ ఉన్నారు. టీడీపీకి సహకరించాలని స్థానిక జనతాపార్టీకి సూచించారు. ఈ వేడుకలో పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌తో సమావేశమైన ఆయన అమరావతిలో జిందాల్ గ్రూప్‌కు ఉన్న అవకాశాలపై చర్చించారు. బృందావన్ బాంకే బిహారీ ఆలయం నుంచి మహామండలేశ్వర స్వామి జయకృష్ణ గిరి మహారాజ్ నాయుడు కోసం ప్రత్యేక నైవేద్యాలతో కార్యక్రమానికి హాజరయ్యారు.చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం సినీనటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రభుత్వంలో 23 మంది మంత్రులు ఉన్నారు. ఇందులో టీడీపీకి చెందిన 19 మంది, పవన్ కళ్యాణ్‌తో సహా ముగ్గురు జనసేనకు చెందిన వారు, ఒకరు బీజేపీకి చెందినవారు ఉన్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. నాయుడు తనయుడు, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కూడా మంత్రి పదవి దక్కింది. ఇతర క్యాబినెట్ సభ్యులలో టీడీపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కే.అచ్చెన్నాయుడు, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉన్నారు. టీడీపీ మంత్రులు 17 మంది కొత్త ముఖాలు, జనసేనకు చెందిన మంత్రులు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కాగా, బీజేపీకి చెందిన ఏకైక మంత్రి సత్య కుమార్ యాదవ్. నాయుడు మంత్రివర్గంలో ముగ్గురు మహిళలు, ఒక ముస్లిం ఎన్ మహమ్మద్ ఫరూక్ ఉన్నారు. 2024 లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని నిర్ణయాత్మకంగా ఓడించడానికి టీడీపీ జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని 175 స్థానాలకు గాను ఎన్డీయే 164, టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 సీట్లు గెలుచుకున్నాయి. జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్సీపీ కేవలం 11 సీట్లు మాత్రమే గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది.

### ప్రకృతి సేద్య ఆహార ఉత్పత్తుల

# దుకాణం ప్రారంభం



**ఆగిరిపల్లి జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి గ్రామంలో నూజివీడు రోడ్డు లో ప్రకృతి సేద్య ఆహార ఉత్పత్తుల దుకాణం ప్రారంభమైనది. ఈ ప్రారంభోత్సవమునకు ముఖ్య అతిథులుగా మండల సూపరిండెంట్, డీటీ హాజరయ్యి ప్రారంభించారని ఆల్ఫాన్సా రాణి తెలిపారు. ఈ ప్రారంభోత్సవమునకు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారని, నూజివీడు డివిజన్ ఆగిరిపల్లి మండలంలో జిల్లా డిపిఎం మరియు జిల్లా స్టాఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసి పండించిన బెల్లం, పసుపు, కారం, రెడ్ రైస్, బ్లాక్ రైస్, పిఎన్ఆర్ రైస్ ,వేరుశెనగ గుళ్ళు ,రకాల పచ్చళ్ళు లభ్యమగునని ప్రకృతి వైద్యం మండలాధికారి ఆల్ఫాన్సారని తెలిపారు.

### భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు పట్ల

# న్యాయవాదుల హర్షం



**బాపట్ల జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు పట్ల న్యాయవాదుల హర్షం వ్యక్తం చేశారు.గురువారం బాపట్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశం లో బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్న కోట సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయమని రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు 100 రోజులు పైగా తీవ్రమైన ఉద్యమం ఆందోళన చేయడం జరిగిందన్నారు. ఈ ఉద్యమంలో బార్ అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రం లో కొత్తగా ఏర్పాటు అయిన ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సదరు ప్రజా విరుద్ధమైన చట్టాన్ని వెంటనే రద్దు చేసినారని హామీ ఇచ్చిన విదంగా ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసినందుకు బాపట్ల బార అసోసియేషన్ సభ్యులు తరుపున ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విన్నకోట సత్య ప్రసాద్, జి సువర్ణ నాగమోహిని, ఇమ్మడిశెట్టి సతీష్, బండి రామ్మూర్తి,దుద్దుకూరి శ్రీరామ్ మూర్తి,కట్ట కొరినేలియా,నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో

# గుంటూరులో ఋణ వితరణ కార్యక్రమం



**గుంటూరు : జూన్ 13 (ఆంధ్రపత్రిక) ;** బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఋణ వితరణ మరియు వినియోగదారుల సమావేశం గుంటూరు మిర్చియార్డ్ దగ్గర అట్లాంటిక్ హోటల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎఫ్.జి.యం.ఓ హైదారాబాదు మనోహర్ రామ్ దాస్ మానే ప్రారంభించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని, ఒక బ్యాంక్ అనేక ఋణాలు అనే నినాదం తో ముందుకు వచ్చింది అని ఈ కార్యక్రమంలో తెలియచేసారు. విజయవాడ జోనల్ మేనేజర్ ఎం.వి.వి. బంగార్రాజు మాట్లాడుతూ గుంటూరు వారియు విజయవాడ పరిసర ప్రజలు మరియు వినియోగదారుల సహకారం తో బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్, యం.ఎస్.యం.ఈ, స్వయం సహాయక సంఘాలకు ఋణాలు ఇవ్వడంలో ఎల్ల వేళలా ముందంజలో ఉంటుందని తెలియచేశారు. వినియోగదారుల యొక్క అభివృద్ధి ధ్యేయంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రు. 58.75 కోట్ల రూపాయలు ఋణాలు మంజూరు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వినియోగదారులు వారి అనుమానాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు మరియు స్వయం సహాయక బృందాలు పాల్గొన్నారు.

# యాదమరిలో కన్నులపండువగా శ్రీ ఇంద్రవరదుని రథోత్సవం





**యాదమరి,జూన్,13: (ఆంధ్రపత్రిక):** యాదమరి శ్రీ వరదరాజు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని గురువారం శ్రీదేవి పెరిందేవి సమేత వరదుని రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఉదయం మూలవర్లకు ప్రత్యేక పూజ కార్యక్రమం యాదమరి లేట్ ఏకాంబరం శెట్టి కుటుంబ సభ్యుల ఉభయం నిర్వహించారు. సాయంత్రం యాదమరి రైతు సంఘం వారి ఉబయం ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులైన స్వామివారిని రథంలో ఊరేగించడానికి సర్వాంగ సుందరంగా సిద్ధంగా ఉంచిన రథంలో కి వేద పండితులు మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య ఐదు గంటలకు చేర్చారు,అనంతరం నాలు గు మాడవీధులలో రథంపై భక్తులకు అభయమిస్తూ స్వామివారు ఉబయదేవేరులతో విహరించారు. రథోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. స్వామి వారి రథాన్ని లాగి రథం పై బొరుగులు పూలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. మొదటి మాడ వీధిలో రథం ప్రారంభ సమయానికే ఒక్కసారిగా జోరున వర్షం మొదలైంది, వర్షాన్ని సైతం లెక్క చేయక భక్తులు మహా విష్ణు రూపంలో ఉన్న శ్రీ శ్రీదేవి పెరుందేవీ సమేత ఇంద్ర వరదరాజ స్వామి పై తమ భక్తిని చాటి రథాన్ని లాగి తిరిగి ఎథా స్థానానికి చేర్చడంతో స్వామివారి రథోత్సవం ప్రశాంతంగా భక్తిమయంతో ముగిసి ంది.సాయంత్రం స్వామివారికి మెట్లతేరోత్సవం, రాత్రి 9 గంటలకు తోటఉత్సవం నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం,ఉదయం మూలవర్లకు పుష్పకైంకర్యం వెన్నత్తాయ్ కణ్ణన్ తిరుక్కోలం ,గుర్రపు వాహనం జరుగుతాయి.

# అవినీతికి పాల్పడ్డ గురుకులాల కోఆర్డినేటర్ పై చర్యలు తీసుకోండి

## జిల్లా కలెక్టరుకు పిర్యాదు చేసిన జనసేన నేత మహేష్ స్వేరో



**బంగారుపాళ్యం,జూన్ 13 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల,జిల్లా కోఆర్డినేటర్ శ్రీమతి వి జయ భారతి గారు గురుకులాల్లో అనేక విధాలుగా అవినీతి కార్యకలాపాలకి పాల్పడుతూ,విచ్చలవిడిగా సీట్లు అమ్ముకోవడం మరియు బినామీల పేర్లతో టెండర్లు దక్కించుకొని అవినీతికి పాల్పడుతున్నారు.అలాగే కొందరు ఉద్యోగస్తుల నుండి వసూల్లు తీసుకోవడం తదితర అంశాలపై చిత్తూరు జిల్లా కలెక్టరు షన్మోహన్ ని కలిసిన జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో బృందం.ఈ సందర్భంగా మహేశ్వరు డికి మాట్లాడుతూ Dr BR అంబేద్కర్ APSWRS గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వి.జయభారతి కొన్ని సంవత్సరాలుగా గురుకులాల్లో పూర్తిగా అవినీతికి పాల్పడుతున్నారని,ఎన్నో వేలమంది పేద విద్యార్థుల అభివృద్ధిని గాలికి వదిలేసారని,ఎల్లప్పుడూ తన స్వలాభం కోసం గురుకులాల్లో అవినీతికి పాల్పడుతూ ఎన్నడూ లేని విధంగా అవినీతి సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని,దీనివల్ల పవిత్రమైన గురుకులాల కీర్తి ప్రతిష్టలు కనుమరుగైపోతున్నాయని, వేలాదిమంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టేస్తున్నారని,ఇలాంటి అవినీతి అధికారుల నుండి గురుకులాలను కాపాడాలని గౌరవ జిల్లా కలెక్టర్ ని కోరడమైందని తెలిపారు.దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈ విషయంపై ప్రత్యేక విచారణ జరిపి,తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా నాయకులు ప్రదీప్ స్వేరో,యువరాజ్ స్వేరో, హస్వంత్ స్వేరో పాల్గొన్నారు.

# ఈఏపిసెట్ లో విద్యార్థుల ప్రతిభ



**గూడూరు,జూన్13(ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపిసెట్ ఫలితాల్లో గూడూరు పట్టణంలోని శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థుల ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు ఈ ఎపి సెట్ లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు. అనంతరం స్టడీ సర్కిల్ కరస్పాండెంట్ శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూఅన్వేష్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో 7247 వ ర్యాంక్, ఎస్.వి యూనివర్సిటీ పరిధిలో 1194 వ ర్యాంక్, సుష్మ రాష్ట్ర స్థాయిలో 8835 వ ర్యాంక్,ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో 1551 వ ర్యాంక్,. విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయిలో 9136 వ ర్యాంక్ సాధించారు.రాష్ట్ర స్థాయిలో 10వేల లోపు 3 ర్యాంక్ లు,20వేల లోపు 6 ర్యాంక్ లు,25వేల లోపు 14 ర్యాంక్ లు,35వేల లోపు 39 ర్యాంక్ లు,50 వేల లోపు 75 ర్యాంక్ లు మొత్తం 152 మంది ర్యాంక్ లు సాధించారన్నారు . ఈ కార్యక్రమంలోచంద్రశేఖర్,.కమలాకర్,మునిరాజా, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఎస్.ఐ.కుమార్తె ప్రేక్ష




**సోమల,జూన్ 13 (ఆంధ్రపత్రిక):** సాధారణంగా ప్రభుత్వ అధికారులు తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని ,సమాజంలో గౌరవంగా ఉండాలని వారిని ఏ కార్పొరేట్ పాఠశాల లోగాని ,ఇంకా పేరున్న ఇంగ్లీష్ పాఠశాల లో అన్ని చేర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఎస్.ఐ గా పని చేస్తున్న సి.వెంకట నరసింహులు మాత్రం భిన్నంగా సోమల లోనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో వేసవి సెలవులు అనంతరం తెరచిన వెంటనే తన కున్న కుమార్తె ప్రేక్ష ను 3 వ తరగతి లో చేర్పించారు. ఇలాంటి సంఘటన లు జరగడం చాలా అరుదని ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ అధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆశిద్దాం.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం..




**సోమల,జూన్ 13 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ పర్యావరణ పై దృష్టి సారించాలని కోరారు.ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి సహజంగా మొక్కలు నాటాలని కోరారు.అలాగే ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి రాబోయే తరాల వారికి ఆదర్శంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి అధికారం చేపట్టినందుకు స్వీట్లు పంచిన కిషోర్



**బంగారుపాళ్యం,జూన్ 13(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతల పట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని చీకూరుపల్లి పంచాయతీలోని ప్రతి ఇంటికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్,ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జనసేన మండల యువత అధ్యక్షుడు ఎ. కిషోర్ జనసైని కులు, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసైనికులు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యలపై రాష్ట్ర సంఘ నాయకునికి వినతి




**బంగారుపాళ్యం,జూన్13(ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి విజయవాడ గన్నవరం కేశరపల్లి వద్ద జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగునాడు గీతకార్మిక సంఘం అధ్యక్షులు రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు రేఖాసుదాకర్ గౌడ్ మంగళగిరి వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి గీత కార్మికులకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రావలసిన ప్రభుత్వ పథకాలు గురించి అలాగే మద్యం షాపుల లో గీత కార్మికులకు రావలసిన పర్సంటేజ్ గురించి ప్రభుత్వ పెద్దల తో చర్చించ వలసినదిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగరాజ గౌడ్, కొత్తపల్లి రెడ్డప్ప గౌడ్, లేబాకుల మురళి గౌడ్,యస్.నారాయణస్వామి,భుజగేంద్ర పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



**గూడూరు,జూన్13(ఆంధ్రపత్రిక):** పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని ట్రస్ట్ ప్రతినిధి సీతారామనాయుడు తెలిపారు . గూడూరు పట్టణంలోని డి.ఎన్.అర్ కమ్యూనిటీ హాల్ లో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు . శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ సహకారంతో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయించాల్సిన వారిని గుర్తించారు . అదేవిధంగా రోగులకు ఉచితంగా మందులు అందజేశారు . ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి సీతా రామనాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు సూచించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

# మంత్రి ఆనం ను కలిసిన పాశిం దంపతులు.



**గూడూరు,జూన్13(ఆంధ్రపత్రిక):** గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ , సంధ్యారాణి దంప తులు గురువారం విజ యవాడలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నీ పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వక కలిశారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇరికిపెంట మలుపులో బోలేరో ,స్కూటర్‌ల ఢీ..






**సోమల,జూన్ 13 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఇరికిపెంట మలుపు వద్ద కర్ణాట క కు చెందిన నంగిలి నుండి టొమోటో ల ను దింపి సోమల కు వస్తూ బొలెరో వాహనం..సదుం జాన్ ద్ర పేటనుండి పుంగనూరు కు వెళ్తున్న స్కూటర్ లు ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది.ఈ క్రమంలో ఇద్దరిలో ఒకరికి చేయి విరిగి నట్లు ఇద్దరి పరిస్థితి విషమంగా అని సమాచారం.. పోలీసుల సమాచారం మేరకు టమోటా బాక్సులతో బొలెరో వాహనం లో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలు ,ఒకరికి చేయి విరిగగా , ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు గాయపడ్డ వారిని హుటాహుటిన సోమల ప్రభుత్వ ఆసుపత్రికు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదన పల్లికి తరలించారు. అనంతరం ప్రమాదంలో గాయపడ్డ వారు కర్ణాటక కు చెందిన నంగిలి గ్రామస్తులు సుబ్బయ్య 60.కేసవ 30 వాసులుగా గుర్తించారు. అలాగే వినోద్ కుమార్ 30 ,చంద్రశేఖర్ 31 ,సదుం జార్ద పేటకు చెందిన వారుగా గుర్తించారు.ఘటన స్థలానికి చేరుకున్న సోమల పోలీసులు బుడ్డనాయక్ చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా శ్రీ శారదా శంకరమఠం వార్షికోత్సవం



**హిందూపురం, జూన్ 13 ( ఆంధ్రపత్రిక ) :** పట్టణంలోని శ్రీ శారదా శంకరమఠంలో శారదా మహిళా మండలి వారు, శంకర మఠం మేనేజ్మెంట్ వారు గురువారం శ్రీ శారదా శంకరమఠం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అభిషేకాలు, లక్ష పుష్పార్చన అలాగే కుంకుమార్చన కార్యక్రమాలు అద్భుతంగా జరిగింది.పురోహితులు ఉత్కంఠ భరితంగా వేదమంత్రాలు పఠించి కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో శ్రద్ధగా జరిపించారు.
శ్రీ మహాగణపతి, శారదా దేవి, జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారి అనుగ్రహం భక్తులందరి పై తప్పక ఉంటుంది అని ఆశిస్తూ శ్రీ శారదా మహిళా మండలి వారికి, శ్రీ శారదా శంకరమఠం మేనేజ్మెంట్ వారికి పురోహితులకు నమస్కార పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# అవినీతి రహిత పాలన తెదేపా ధ్యేయం

## పట్టణ అభివృద్ధి కి ప్రాధాన్యం



**బాపట్ల జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** అవినీతి రహిత పాలన తెదేపా ధ్యేయం అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హల్ లో జరిగిన సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణాభివృద్ధి కి ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో దోమల బెడద అధికంగా ఉందని దోమల నివారణకు అధికారులు తీవ్ర కృషి చేయవలసిన బాధ్యత ఉందన్నారు. అవినీతి లేని పాలన అందించడానికి అధికారులు ముందుకు వెళ్లాలని సూచన చేశారు.పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి పురవీధులన్నీ పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేసే ప్రజలకు జవాబుదారులుగా నిలవాలని సూచనలు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని ప్రతి రోజూ డ్రైనేజీలను పరిశుభ్ర పరుస్తూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అన్ని వార్డులను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ముం దుకు వెళుతున్నానని వివరించారు.పారిశుధ్య కార్మి కులను ప్రజా ప్రతినిధులు,అధికారుల నివాసాలలో పనులకు పంపించకుండా ఉండాలని ప్రభుత్వ జీతాలు ఇస్తూ అధికారుల నివాసాలలో ప్రజాప్రతి నిధుల నివాసాలలో పనులు చేయిస్తే సహించేది లేదన్నారు. స్వయంగా ప్రతి ఒక్క పాశుద్ధ్య కార్మికుడితో తాను మాట్లాడతానని పాశుద్ధ్య కార్మికుల సమస్యలు అన్నిటికీ పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.అవినీతి లేని పాలన చేసి ప్రభుత్వానికి మంచి పేరు అధికారులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

# డెలివరీకి అని హాస్పిటల్ తీసుకెళ్తే విగత జీవి ఐ తిరిగి వచ్చింది

## శోకసముద్రంలో కుటుంబ సభ్యులు



**ఆగిరిపల్లి జూన్ 13 (ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి నూజివీడు రోడ్ లో గోళ్ళ నరసింహారావు చిరు వ్యాపారం చేసుకుంటూ కాలం వెలదీస్తున్నాడు అతనికి ఇద్దరు కుమార్తెలు రెండవ కుమార్తె కాన్పు కోసం హాస్పిటల్ కు ఈనెల 12న తీసుకెళ్లారు. ఈరోజు ఉదయం ఏమైందో కానీ అంబులెన్స్ అర్జెంటు రెడీ చేయండి అన్నారు ఈ లోపల మీ బిడ్డ చనిపోయింది అనడంతో శోకసముద్రంలో మునిగిపోయారు. రెండవ అమ్మాయిని "చనిపోయిన"సింగ్ నగర్ వాస్తవ్యులకు ఇచ్చి పెళ్లి చేయగా అతను కూడా షాపులో గుమస్తాగా ఉంటూ కాలం వెళ్ళబోస్తున్నాడు. ఆ చిన్నారి అమ్మ అమ్మ అంటూ పిలుస్తుండటంతో అక్కడ ఉన్న అందరు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతి చెందిన గర్భిణీ తండ్రి నరసింహారావు ఈ విషయంపై మాట్లాడుతూ నేను ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని మనుమరాలు పరిస్థితి ఏంటో అర్థం కావటం లేదని తల్లి లేని అనాథ అయిపోయినదని కన్నీటి పర్యంతమైనాడు

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోపుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

**తిరుమల, జూన్ 13 (ఆంధ్రపత్రిక):** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూన్ 14వ తేదీ శుక్రవారం జరుగనున్న పుష్పయాగానికి గురువారం సాయంత్రం 6.30 నుండి సేనాధిపతి ఉత్సవం, శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ విష్వక్సేనులవారు ఆలయ మాడ వీధుల్లో విహరించారు. ఆ తరువాత అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలురకాల పుష్పాలు, పత్రాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.

అనంతరం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఓ శాంతి, ఏఇఓ ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎస్ఆర్ఎం కులపతి



**అమరావతి, జూన్,13: (ఆంధ్రపత్రిక):** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి, మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ టీఆర్ పారివేందర్, మరియు యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనా రాయణన్ లు బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన డాక్టర్ పారివేందర్ ముఖ్యమంత్రిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏపీ ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్న ఆశాభావాన్ని కులపతి డాక్టర్ పారివేందర్ వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధమైన పాలన అందించాలని ఆయన కోరారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరావతి పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయనున్నామనీ, ఎస్ఆర్ఎం వర్సిటీకి అన్ని విధాలా అవసరమైన సహాయ సహకారాలను తప్పక అందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన పలువురు అధికారులు కూడా ఉన్నారు.

## మంత్రులు కేటాయింపులలో జనసేన పార్టీ బిసి ప్రతినిధులకు అన్యాయం

### - ఫిషర్ మెన్ జేఏసీ చైర్మన్ సైకం. రాజశేఖర్ డిమాండ్...



**విజయవాడ ,జూన్,13: (ఆంధ్రపత్రిక):** మంత్రులు కేటాయింపుల్లో జనసేన పార్టీ బీసీ ప్రతినిధులకు అన్యాయం జరిగిందని రాష్ట్ర హైకోర్టు న్యాయవాది, ఏపీ ఫిషర్ మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ అన్నారు. గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఏపీ ఫిషర్ మెన్ జేఏసీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకం రాజశేఖర్ మాట్లాడుతూ మంత్రివర్గంలోకి మత్స్యకార సామాజిక వర్గం నుండి కొల్లు రవీంద్ర తీసుకున్నందుకు ఫిషర్మెన్ జెఏసి తరపున తెలుగుదేశం పార్టీకి ధన్యవాదములు తెలియజేశారు.బిసి కులాలలో అత్యధిక జనాభా (40 లక్షలు) కలిగిన మత్స్యకారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 120 అసెంబ్లీ స్థానాలోని రాజకీయ పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటమీలను శాసించగలరు. దశాబ్దాలు నుండి మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో రాజకీయ పార్టీలు విఫలం చెందాయి అలాగే మంత్రులు కేటాయింపులో కూడా మత్స్యకారులకు అన్యాయం చేశారన్నారు. తాజాగా, మంత్రివర్గంలోని సామాజిక వర్గాలవారీగా పరిశీలిస్తే ప్రధానంగా కమ్మ సామాజిక వర్గాల నుండి 5 గురికి మంత్రి పదవులు కేటాయించగా, రెడ్డి సామాజిక వర్గానికి 3 మంత్రి పదవులు, కాపు (తూర్పు కావుతో కలిపి) ఆ సామాజిక వర్గం నుండి 4 గురికి మంత్రి పదవులు కేటాయించారు. కమ్మ, రెడ్డి, కాపు సామాజిక వర్గాలకు వారి జనాభా దామాషాకు మించి మంత్రి పదవులు, అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు నారా చంద్రబాబు నాయుడుగారు, పవన్ క్యాణారు, పురంధరేశ్వరి కేటాయించుకున్నారు. అలాగే, బి.సి, యాదవ కులానికి 2 మంత్రి పదవులు, యాదవ సహా కులం కురబ సామాజిక వర్గానికి ఒక మంత్రి, గీత సామాజిక వర్గానికి 2 మంత్రి పదవులు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యంగా బిసి కులాల్లో అత్యధిక జనాభా కలిగిన కులాలు మత్స్యకార కులాలు. ఈ కులాలకు టిడిపి 2 అసెంబ్లీ స్థానాలు, జనసేన 1 అసెంబ్లీ స్థానం కేటాయించింది. ఈ కేటాయింపుల్లో కూడా మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసారని చెప్పారు. మంత్రివర్గ కూర్పులోనైన మత్స్యకారులకు మిగతా బిసి కులాలవలే ఇద్దరికి అవకాశం కల్పిస్తారని భావించిన మత్స్యకారులకు నేటి ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తే, వాటిలో బ్రాహ్మణులు-1, ఎస్సీలు-3, ఎస్టీలు-2, కమ్మ-1, రాజు-1, యాదవ-1, అగ్నికుల క్షత్రియ (మత్సకార)-1, ఇంకా మిగిలిన స్థానాలు అంటే 11 అసెంబ్లీ స్థానాలు జనసేన కాపులకు కేటాయించిందన్నారు. రెండు పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసిన జనసేన, ఆ రెండు స్థానాలకు కూడా కాపు కులస్థులకే కేటాయించారని, పవన్ కళ్యాణ్ గారు చెప్పిన సామాజిక న్యాయాన్ని ఆయన అమలుపరచలేదన్నారు. తాజాగా జనసేన నుండి మంత్రివర్గంలోకి తీసుకున్న సామాజిక వర్గాలు పరిశీలిస్తే పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్ ఒకే కాపు సామాజిక వర్గానికి చెందినవారు కాగా, నాదెండ్ల మనోహర్ కమ్మ కులానికి చెందినవారు. ఈ రీత్యా కూడా జనసేన పార్టీలోని బిసిలకు ముఖ్యంగా మత్స్యకారులకు అన్యాయం జరిగిందని చెప్పారు. ఇప్పుడు మిగిలిన ఒక మంత్రి పదవి జనసేన పార్టీ బిసిలకు కేటాయించాలని, అత్యధిక సీట్లు, మంత్రి పదవులు అగ్రకులాలకు కేటాయించుకుని సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కీలకమైన దశలో మత్స్యకారులకు సీట్లు, మంత్రులు కేటాయింపులో అన్యాయం చేసిన పార్టీ, రేపు కేటాయించే రాజ్యసభ, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్ వంటి పలు రకాల నామినేటెడ్ పోస్టులు కేటాయింపులలో మత్స్యకారులకు న్యాయం చేస్తారనీ ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీకి మత్స్యకారులు అండగా నిలబడి, అఖండ మెజారిటీని జనసేన పార్టీకి ఇచ్చిన విషయం గుర్తించాలనీ, తక్షణమే జనసేన నుండి మంత్రివర్గంలోకి మత్స్యకారులకు లేదా సోదర బి.సి. కులాలకు అవకాశం కల్పించాలనీ ఏపి ఫిషర్మెన్ జెఏసి తరపున డిమాండ్ చేశారు. ఈ సమావేశం బడుగు శ్రీకాంత్, బడుగు నరేంద్ర, ఎన్. కాళీ, గాడి రాము తదితరులు పాల్గొన్నారు.

## విక్స్ మాత్ర ఇప్పుడు పెద్దదైంది




**విజయవాడ ,జూన్ 13: (ఆంధ్రపత్రిక):**పవర్‌హౌస్ బ్రాండ్ అంబాసిడర్ రణవీర్ సింగ్, విక్స్‌కు సంబంధించిన అతి పెద్ద వార్త 'విక్స్ మాత్ర ఇప్పుడు మరింత పెద్దదైంది' అని ప్రకటించి, రెండు దశాబ్దాల అనంతరం ఐకానిక్ త్రిభుజాకార విక్స్ కాఫ్ డ్రాప్స్ మొట్టమొదటి డబుల్ పవర్డ్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను ఆవిష్కరించారు. పీ అండ్ జీ ఇండియా కన్స్యూమర్ హెల్త్‌కేర్ కేటగిరీ లీడర్ సాహిల్ సేథీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "విక్స్ మాత్రతో ఖిచ్ ఖిచ్‌ను దూరం చేసుకోండి' అనే విక్స్ కాఫ్ డ్రాప్స్ ఐకానిక్ బ్రాండ్ జింగిల్ ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. ఖిచ్ ఖిచ్ రహిత స్వరంలో మాట్లాడేందుకు 1960 నుంచి భారతీయులకు సహాయపడిన వ్యామోహాన్ని తక్షణమే కలిగిస్తుంది. మా వినియోగదారులకు ఏమి కావాలో ఎల్లప్పుడూ వారి అభిప్రాయాలను వినడం ద్వారా, మా ఉత్పత్తి సూత్రీకరణలు, ప్యాకేజింగ్‌లో ఈ అభిప్రాయాలను పొందుపరచడం ద్వారా ఈ వారసత్వాన్ని పెంపొందించుకునేందుకు ఉన్నాము. కొన్ని దశాబ్దాల అనంతరం మా అతిపెద్ద వార్త విక్స్ డబుల్ పవర్ కాఫ్ డ్రాప్స్‌ను విడుదల చేస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము" అని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఎస్.ఐ.కుమార్తె ప్రేక్ష



**సోమల,జూన్ 13 (ఆంధ్రపత్రిక):**సాధారణంగా ప్రభుత్వ అధికారులు తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని ,సమాజంలో గౌరవంగా ఉండాలని వారిని ఏ కార్పొరేట్ పాఠశాల లోగాని ,ఇంకా పేరున్న ఇంగ్లీష్ పాఠశాల లో అన్ని చేర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఎస్.ఐ గా పని చేస్తున్న సి.వెంకట నరసింహులు మాత్రం భిన్నంగా సోమల లోనే ఉన్న ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల లో వేసవి సెలవులు అనంతరం తెరచిన వెంటనే తన కున్న కుమార్తె ప్రేక్ష ను 3 వ తరగతి లో చేర్పించారు. ఇలాంటి సంఘటన లు జరగడం చాలా అరుదని ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ అధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆశిద్దాం.

## కూటమి అధికారం చేపట్టినందుకు స్వీట్లు పంచిన కిషోర్



**బంగారుపాళ్యం,జూన్ 13(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని చీకూరుపల్లి పంచాయతీలోని ప్రతి ఇంటికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్,ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జనసేన మండల యువత అధ్యక్షుడు ఎ. కిషోర్ జనసైని కులు, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసైనికులు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యలపై రాష్ట్ర సంఘ నాయకునికి వినతి




**బంగారుపాళ్యం,జూన్13(ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి విజయవాడ గన్నవరం కేశరపల్లి వద్ద జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగునాడు గీతకార్మిక సంఘం అధ్యక్షులు రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు రేఖాసుదాకర్ గౌడ్ మంగళగిరి వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి గీత కార్మికులకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రావలసిన ప్రభుత్వ పథకాలు గురించి అలాగే మద్యం షాపులలో గీత కార్మికులకు రావలసిన పర్సంటేజ్ గురించి ప్రభుత్వ పెద్దలతో చర్చించ వలసినదిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగరాజ గౌడ్, కొత్తపల్లి రెడ్డప్ప గౌడ్, లేబాకుల మురళి గౌడ్,యస్.నారాయణస్వామి,భుజగేంద్ర పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**గూడూరు,జూన్13(ఆంధ్రపత్రిక):** పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని ట్రస్ట్ ప్రతినిధి సీతారామనాయుడు తెలిపారు . గూడూరు పట్టణంలోని డి.ఎన్. అర్ కమ్యూనిటీ హాల్ లో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు . శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ సహకారంతో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయించాల్సిన వారిని గుర్తించారు . అదేవిధంగా రోగులకు ఉచితంగా మందులు అందజేశారు . ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి సీతా రామనాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు సూచించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

## మంత్రి ఆనం ను కలిసిన పాశం దంపతులు.



**గూడూరు,జూన్13(ఆంధ్రపత్రిక):**గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ , సంధ్యారాణి దంప తులు గురువారం విజ యవాడలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నీ పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వక కలిశారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎం.పి కేశినేని శివనాథ్ (చిన్ని)

### -దేవాలయాలలో ప్రత్యేక పూజలు-కుటుంబ సమేతంగా దర్శనం





**విజయవాడ ,జూన్,13: (ఆంధ్రపత్రిక):**ఎం. పి హెూదాలో తొలిసారి గా కేశినేని శివ నాథ్ ఇంద్రకీలాద్రి పైన కనకదుర్గ అమ్మవారిని, శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం లో వినాయక స్వామిని కుటుంబ సమేతంగా గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు అనంతరమే ఎం.పి అభ్యర్థి గా కేశినేని శివ నాథ్ నామినేషన్ దాఖలు చేయటం జరిగింది. ఎం.పి గా కేశినే ని శివనాథ్ భారీ మెజార్టీ తో గెలవటం తో ఈ రెండు ఆలయా లను దర్శించి మొక్కులు చెల్లించటం జరిగింది. కేశినేని శివ నాథ్ కు కనకదుర్గమ్మ ఆలయ ఈ.వో కె.ఎస్ రామారావు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయగా, ఆలయ ప్రధాన అర్చకులు వేదం మంత్రోచ్చారణ తో ఆహ్వానం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసా దాలు అందజేయగా, ఆలయ ఈ.వో కె.ఎస్ రామారావు అమ్మవారి చిత్రపటాన్ని కేశినేని శివనాథ్ కు అందజేశారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉంటూ అభివృద్ధి పథంలో పయ నించే విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. అంతకుముందు కెనాల్ రోడ్ లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలోని వినాయకుడిని ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగింది.

## డేటాసైన్స్‌లో విస్తృత పరిశోధనలు చేయాలి

### ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీ.పీ.రాజశేఖర్

### విజ్ఞాన్స్‌లో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ కాన్ఫరెన్స్



**గుంటూరు : జూన్ 13 ( ఆంధ్రపత్రిక ):** విద్యార్థులందరూ డైటాసైన్స్‌పై విస్తృత పరిశోధనలు చేయాలని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీ.పీ.రాజశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను హైబ్రిడ్ మోడ్‌లో ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్. గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీ.పీ.రాజశేఖర్ మాట్లాడుతూ మేథమ్యాటిక్స్, స్టాటిస్టిక్స్‌లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో డేటాసైన్స్‌ను పరిశోధనాంశంగా ఎంచుకోవాలన్నారు. ప్రస్తుతం అన్ని మల్టీ నేషనల్ కంపెనీలు డేటాసైన్స్‌ను విరివిగా వినయోగిస్తున్నారని తెలియజేసారు. కాబట్టి ఇందులో ప్రావీణ్యం పొందిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్ మాట్లాడుతూ సమాచారం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. విద్యార్థులు అప్‌డేట్ అయితేనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలరని, నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మార్చుకోవాలన్నారు.

కేవలం అకడమిక్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా వీలైనన్ని కొత్త విషయాలూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో ముఖ్య అతిథిగా హాజరైన సౌది అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నబిల్ మలైకీ విద్యార్థులకు ఆల్‌జీబ్రాలో వస్తున్న సరికొత్త డెవలప్ మెంట్స్‌ను నిత్యజీవితంలో ఎలా వినియోగించాలో తెలియజే సారు. అలాగే ఆన్‌లైన్‌లో మరో ముఖ్య అతిథిగా హాజరైన లెబనాన్‌లోని లెబనీస్ అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జుల్కర్‌మైన్ సబిర్ విద్యార్థులకు న్యూమరల్ నెట్‌వర్క్ సిస్టమ్‌లోని మెళుకువలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అంగన్వాడిల ఘనసత్కారం



**గోకవరం / జగ్గంపేట జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** జగ్గంపేట రావులమ్మ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు జగ్గంపేట మండలం అంగన్వాడీలు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలో సాలువలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈసందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో మాకు అన్యాయం జరిగిందని, తమ సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబుకి తెలియజేసి మాకు న్యాయం చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, అంగన్వాడి యూనియన్ లీడర్లు సుజాత, భవాని, అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోకవరం మండలంలో పలువురుకి వైసీపీ యువనాయకులు తోట రాంజీ పరామర్శ



**గోకవరం, జూన్ 13 (ఆంధ్రపత్రిక) :** గోకవరం మండలం, గోకవరం టౌన్ లో పలువురిని వైసీపీ యువనాయకులు తోట రాంజీ పరామర్శించడం జరిగింది. ఇటీవలి కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న వైసీపీ నాయకులు సుంకర రమణ, తదుపరి పార్టీ నాయకులు తుమ్మల చిన్నబ్బు అల్లుడు బి ఉదయ్ ఇటీవలి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన మందపాటి మణిరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విజన్‌తో పనిచేస్తా..

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్రంలో ఇకపై పరదాలు, నియంత్రణ వుండదు. నేటి నుంచి ప్రజా పాలన ప్రారంభం అయ్యింది. గత 5 ఏళ్లలో జరిగిన నష్టం అపారం. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. 2047 నాటి భారత్ ప్రపంచంలోనే మొదటి రెండు స్థానాల్లోకి వస్తుంది. 2047 విజన్‌తో ముందుకు వెళ్తానని ప్రకటించారు. ఏపీ దేశంలోనే నెంబర్ 1న రాష్ట్రంగా ఉండాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలి. తెలుగు రాష్ట్రాలకు పెద్దగా రెంటికీ మంచి జరిగేలా చూస్తానని అన్నారు. గురువారం ఉదయం చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వెంకటేశుని దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీవారి ఆశీస్సుల కారణంగానే తమ కూటమి విజయం సాధించిందన్నారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని.. 93 శాతం స్ట్రైక్ రేట్ గతంలో



ఎప్పుడూ రాలేదన్నారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు.. కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారన్నారు. తాను ఏ కార్యం చెయ్యాలన్నా ముందుగా తన కుల దైవమైన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందుతానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేవాన్ష్ పుట్టినరోజు నాడు శ్రీవారి అన్నదానానికి ప్రతి ఏటా విరాళం ఇస్తున్నాం. నేను ప్రతి రోజు గంటల తరబడి పూజలను చెయ్యను. ఒక్క నిమిషం మాత్రమే ధ్యానం చేస్తాను.

శ్రీవారిని ఒక్కటే కోరుకుంటా. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. దేశం అభివృద్ధి చెందాలి. సంపదను సృష్టించి పేద ప్రజలకు పంచే అవకాశం ఇవ్వాలని కోరుకుంటానని అన్నారు. మన రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించే విధంగా ముందుకు వెళ్తాం.' అని చంద్రబాబు చెప్పారు.

# విమానయాన రంగాన్ని ఆధునీకరిస్తాం

**న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రపత్రిక):**కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమానయాన శాఖ అప్పగించారన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు. 'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్ధవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్ధవంతంగా నిర్వహిస్తాను. 100 రోజుల ప్రణాళిక తయారు చేస్తాం. 2047 నాటికి సివిల్ ఏవియేషన్‌లో ఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం అని వివరించారు. అలాగే సామాన్య ప్రయాణికుల కోసం ఈస్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం. పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం. భవిష్యత్తులో 100 శాతం పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని రామ్మోహన్ చెప్పారు. 'ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తాం. సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తాం. విమానయాన రంగానికి పునాదులు వేసిన వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఉడాన్ స్కిమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణం చేరువైంది. జ్యోతిరాదిత్య సింధియా సూచనలు తీసుకున్నాను. డీజీ యాత్రను విమానాశ్రయా లకు విస్తరిస్తాం. సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. మోదీ, చంద్రబాబు



విజనరీ లీడర్స్. వారిద్దరి లిడర్ షిప్‌లో పౌర విమానయాన శాఖను ముందుకు తీసుకువెళతాను. భోగాపురం ఎయిర్ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేసి విమానాలు ల్యాండ్ చేస్తాం. విజయవాడ, తిరుపతికి కనెక్టివిటీ పెంచుతాం. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తానని వివరించారు. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్‌ను ఏపీ నుంచి ప్రారంభిస్తాను. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారిగా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తాం. విజయవాడ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేస్తాం.



# అమ్మవారి సేవలో సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌జేసీ రత్నరాజు, దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్.రామరావు, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, తెలుగుదేశం నాయకులు బుద్దా వెంకన్న, కె.పట్టాభి రామ్, నాగుల్ మీరా, జంపాల సీతారామయ్య తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిన్నారులు సంప్రదాయ నృత్యంతో స్వాగతం నడుమ ముఖ్యమంత్రి దంపతులు రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో ముఖ్యమంత్రి దంపతులకు స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణతో అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. అంతరాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవోలు ముఖ్యమంత్రి దంపతులకు అమ్మవారి శేషవస్త్రం, పట్టు వస్త్రాలను, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## అధికారులకు చంద్రబాబు హెచ్చరికలు

### వ్యవస్థను గాడి తప్పించిన అధికారులు

### సివిల్ సర్వెంట్స్ తీరు ఇలా ఉండడం సరికాదు



**అమరావతి, జూన్ 13 (ఆంధ్రపత్రిక):**బాధ్యతలు చేపట్టిన సీఎం చంద్రబాబును పలువురు ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు కలిశారు. అందులో జగన్‌కు అంటకాగిన వారు కూడా ఉన్నారు. వివిధ శాఖాధిప తుల హెచ్‌వోడీల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 1995లో సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లు అంటే గౌరవం ఉండేది. కానీ గత ఐదు సంవత్సరాల్లో వ్యవస్థ గాడి తప్పింది. ఇక రాబోయే 5 సంవత్సరాల్లో గాడీలో పెడతాను. ఆనాడు 1995లో అధికారులు నిబంధనలు ప్రకారం వ్యవహరించేవా రని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయని, కొంతమంది అధికారులు వ్యవహరించిన తీరుపై చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. నాకు ప్రస్తుతం సమయం లేదు. రెండు మూడు రోజులు తర్వాత మరోసారి కలుద్దాం' అని చంద్రబాబు అన్నారు. కాగా ఈ సమావేశానికి గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన కొంతమంది అధికారులు కూడా వచ్చారు. అయితే ఆ అధికారులు కూడా వచ్చారనే విషయాన్ని చంద్రబాబుకు పేషీ అధికారులు ముందుగానే చెప్పారు. దీంతో చంద్రబాబు మూడు నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారని తెలుస్తోంది.

# అందరినీ నేరుగా కలుస్తా

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్త లు ప్రయత్నిస్తున్నారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిం చారు. తనే స్వయంగా జిల్లాలవారీగా వచ్చి పార్టీ శ్రేణులు, అభిమానులను కలుస్తానని ప్రకటించారు. అలాగే తనకు ఆర్భాటాలు నచ్చవని, తనను కలిసేందుకు వచ్చేవారు బొకేలు, శాలువాలు తీసుకుని రావద్దని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగంలో ఉన్నవారు, యువత, రైతులు ఇలా అందరూ నాకు అభినందనలు తెలుపుతున్నారు. ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. త్వరలోనే జిల్లాలవారీగా అందరినీ కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నాను.

నాకు అభినందనలు తెలియజేయడానికి వచ్చేవారు పూల బొకేలు, శాలువాలు తీసుకురావద్దని విజ్ఞప్తి చేస్తున్నా అని పవన్ తెలిపారు. తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల 20న పర్యటిస్తాన ని పవన్ కల్యాణ్ తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, స్థానిక కార్యకర్తలను కలుస్తానన్నారు. ఆ తర్వాత దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని చెప్పారు.

# ప్రధాని మోదీ ఇటలీ పయనం

**న్యూఢిల్లీ, జూన్ 13:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీకి పయనమయ్యారు. ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు ఆ దేశంలో ప్రారంభ మైన జీ7 దేశాల వార్షిక సదస్సులో ఆయన పాల్గొననున్నారు. కేంద్రంలో వరుసగా మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. దీనిపై ఆయన హర్షం వ్యక్తంచేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. జీ7 చర్చల్లో భాగంగా కృత్రిమ మేధ, ఇంధనం, ఆఫ్రికా, మధ్యధరా, గ్లోబల్ సౌత్ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే ఇతర నేతలతో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా ప్రాంతంలోని ఓ లగ్జరీ రిసార్ట్‌లో జీ7 దేశాల సదస్సు (జూన్ 13–15) ప్రారంభమైంది. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, ఇమాన్యుయేల్ మెక్రాన్, జపాన్, కెనడా, బ్రిటన్ ప్రధానులు ఫుమియో కిషిదా, జస్టిన్ ట్రూడో, రిషి సునాక్, జర్మనీ ఛాన్స్‌లర్ ఓలాఫ్ షోల్జ్ తదితర నేతలు ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. జార్జియా మెలోనీ వారికి స్వాగతం పలికారు. ఇదిలాఉండగా.. గతేడాది జపాన్‌లోని హిరోషిమా వేదికగా జరిగిన జీ7 దేశాల సదస్సుకు మోదీ హాజరైన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇతర ప్రపంచ నేతలతో చర్చలు జరిపారు.

# బీజేపీ సర్కార్ కీలక నిర్ణయం

**పూరి, జూన్ 13:** ఎన్నాళ్లుగానో మూసిన తలుపులు తెరుచుకున్నాయి. భక్తుల హృదయాలు పులకరించాయి. దేవదేవుడి దర్శనానికి నాలుగు ద్వారాలు తెరిచారు. ఇన్నాళ్లు ఒక్క ద్వారం గుండానే పూరీ జగన్నాథుడిని దర్శించుకున్న భక్తులు.. ఇప్పుడు నాలుగు దిక్కుల నుంచి జగన్నాథుడి దర్శనం చేసుకోవచ్చు. నలు దిక్కుల వ్యాపించిన నారాయణుడిని, నాలుగు ద్వారాల నుంచి వచ్చి భక్తితో నమస్కరించుకోవచ్చు. ఒడిశాలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ.. తన ఎన్నికల హామీని నెరవేర్చుకుంది. తాజాగా గురువారం పూరీ జగన్నాథ స్వామి ఆలయంలోని నాలుగు ద్వారాల నుంచి భక్తులను అనుమతిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీజేపీ సర్కార్, ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. పూరీ జగన్నాథ ఆలయంలో 4 ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. కొవిడ్ టైమ్‌లో అప్పటి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, వీటిలో మూడింటిని మూసివేశారు. వాటిని అప్పటినుంచి తెరవలేదు. మూతపడ్డ ప్రవేశ ద్వారాలు.. ఎన్నికల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఎట్టకేలకు ఈ ద్వారాలను బీజేపీ సర్కార్ ఓపెన్ చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒడిశా కొత్త ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఆయన మంత్రి వర్గ సహచరులు పూరీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. ఇక పూరీ జగన్నాథ ఆలయంలో అభివృద్ధి పనుల కోసం 500 కోట్ల రూపాయలను బ్జడెట్‌లో కేటాయించనుంది ఒడిశా నయా సర్కార్.పూరీలోని జగన్నాథుడి ఆలయానికి నాలుగు దిక్కుల్లో నాలుగు ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. తూర్పు దిక్కున ఉండే ద్వారాన్ని? సింహ ద్వారం అంటారు. దీనికి రెండు వైపులా సింహాల విగ్రహాలు ఉంటాయి. ఆలయంలో ప్రవేశించడానికి ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం కూడా ఇదే. ఇది గ్రాండ్ రోడ్డుకు ఎదురుగా ఉంటుంది. సింహాన్ని మోక్షానికి ప్రతీకగా చెబుతారు. ఈ ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించేవారికి మోక్ష ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇదే ద్వారంలో కాశీ విశ్వనాథుడు, గౌడీయ నరసింహ, భాగ్య హనుమాన్ దేవతల విగ్రహాలు కూడా ఇక్కడే కొలువు దీరి ఉంటాయి. ఇక పశ్చిమంలో ఉండే ద్వారాన్ని వ్యాఘ్ర ద్వారం అంటారు. వ్యాఘ్రం అంటే పెద్దపులి. ఈ ద్వారానికి రెండువైపులా పులుల ప్రతిమలు ఉంటాయి. పులిని ధర్మానికి ప్రతీకగా చెబుతారు. ఇక ఉత్తర భాగంలో నుంచి ఆలయంలోకి ప్రవేశించే ద్వారాన్ని .హస్తి ద్వారం అంటారు. దీనికి ఇరువైపులా ఏనుగు విగ్రహాలు కొలువుదీరి ఉంటాయి. ఇక ఆలయానికి దక్షిణ భాగంలో ఉండే ద్వారాన్ని, అశ్వ ద్వారం అంటారు. ఈ ద్వారానికి రెండువైపులా గుర్రాల ప్రతిమలు ఉంటాయి. గుర్రాలను కోరికలకు చిహ్నాలుగా చెబుతారు. ఈ ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించేవాళ్లు కోరికలను వీడాలని చెబుతారు. ఈ నాలుగు ద్వారాలు ధర్మానికి, జ్ఞానానికి, వైరాగ్యానికి, ఐశ్వర్యానికి ప్రతీకలు అని పండితులు చెబుతుంటారు.

# దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం

### స్వయం సమృద్ధి సాధించేలా కృషి

### బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్13:**బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విదేశాలపై ఆధారపడే రోజులు పోయేలా చూస్తామని అన్నారు. మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని కిషన్‌రెడ్డి అన్నారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. దిల్లీలో గురువారం ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతాం. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాం. బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖల అధికారులు ఒక బృందంగా నిబద్ధతతో పనిచేస్తాం కిషన్‌రెడ్డి చెప్పారు. బొగ్గు, గనుల శాఖ మంత్రి తనకు ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు అప్పగించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో విద్యుత్ లేకుండా, ఏ పని కూడా కాదని.. విద్యుత్ కోతల కారణంతో అనేక మంది రైతులు దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మోదీ వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు లేవన్నారు. పవర్ మినిస్టీ, రైల్వే మినిస్టీ, పర్యావరణ శాఖలకు, బొగ్గు గనుల శాఖకు అనుబంధం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. అన్ని మంత్రిత్వ శాఖలను కలుపుకొని ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మనకు కావాల్సిన బొగ్గును మనం ఉత్పత్తి చేసుకుంటామని వెల్లడించారు. ఉపాధి అవకాశాలు పెంచడంపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు అందరం పని చేయాలన్నారు. ప్రధాని మోదీ దేశ ఆకాంక్షలు కోసం ముందుకు వెళుతున్న ఆయనతో పాటు అందరూ నడవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

# బాధ్యతలు స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు వివిధశాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు.. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై సీఎం మొదటి సంతకం చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై రెండో సంతకం, సామాజిక పింఛన్ల రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సిఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సచివాలయానికి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు అమరావతి రైతులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా పూలు చల్లి మహిళలు హారతులు పట్టారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంలో భారీ పూలదండలతో ఆయనకు స్వాగతం పలికారు. వారిని చూసిన చంద్రబాబు తన కాన్వాయ్ నుంచి దిగి రైతులకు అభివాదం చేశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రయాణించే రోడ్డుమార్గం మొత్తం అమరావతి రైతులు పూలతో నింపేశారు. సీడ్ యాక్సెస్, మందడం, వెలగపూడి రోడ్ల మీదుగా సచివాలయం వరకు రకరకాల పూలతో రహదారులు నిండిపోయాయి. ఐదేళ్ల తర్వాత అమరావతి అభివృద్ధికి అడుగులు పడనుండడంతో చిన్న, పెద్ద, కులం, మతం తేడా లేకుండా స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొనడంతో మందడంలో భారీ జన సందోహం నెలకొంది. పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు చంద్రబాబు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పర్యటన ముగించుకొని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీఎంకు దేవాదాయ శాఖ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ప్రలోభాలకు లోనుకావద్దు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నోరు కట్టడి చేసే అవకాశం ఉందని జగన్ అన్నారు. శాసనమండలిలోనైనా గట్టిగా ప్రభావం చూపాలని వైసీపీ ఎమ్మెల్సీలకు జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు. అంటూ సూచించారు. గురువారం వైఎస్ జగన్ వైసీపీ ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలు ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు. అంటూ ఎమ్మెల్సీలకు సూచించారు. 40 శాతం ప్రజలు మనవైపే ఉన్నా రంటూ గుర్తుచేశారు. మనం చేసిన మంచి పనులు ప్రజలకు గుర్తున్నాయి. అసెంబ్లీలో తమ నోరును కట్టడి చేసే అవకాశం ఉందని.. మండలిలో గట్టిగా పోరాడుదాం అంటూ జగన్ సూచించారు. ఇటీవల జరిగిన జనరల్ ఎలక్షన్‌లో ఘోర ఓటమిపాలైన వైసీపీకి, శాసనమండలిలో మాత్రం 39 మంది ఎమ్మెల్సీ ల బలం ఉంది. త్వరలో అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్సీలకు దిశానిర్దేశర చేశారు. ప్రధానంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు ఇతర కీలక బిల్లులను త్వరలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మరికొన్ని బిల్లులను కూడా ఉపసంహరించే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో శాసనసభలో బలం లేకపోయినా.. మండలిలో ఉన్న బలంతో ఆయా బిల్లుల విషయంలో ప్రభుత్వ నిర్ణయాల్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటనకు అవకాశం ఉంటుంది. అలాగే అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందాలంటే మండలిలో తగినంత బలం ఉండాలి. ఈ క్రమంలో ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్సీలకు వైఎస్ జగన్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. రాష్ట్ర వ్యాప్త పర్యటనకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది.

# యువత భవిష్యత్తు నాశనం

**న్యూఢిల్లీ, జూన్ 13:**నీట్ కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కాంగ్రెస్ గురువారం మరోసారి డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) డైరెక్టర్ జనరల్‌ని తొలగించాలని పునరుద్ఘాటించింది. ఈ అంశంపై దేశ ప్రజల్లో ఉన్న ఆగ్రహం పార్లమెంటులో కూడా ప్రతిధ్వనిస్తుందని కాంగ్రెస్ హెచ్చరించింది. నీట్ పరీక్ష వివాదంపై విచారణ చేపట్టాలన్న దేశవ్యాప్త డిమాండ్‌పై మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధ్యతా రాహిత్యం మరియు అవివేకమని మండిపడింది. గ్రేస్ మార్కులు ఒక్కటే సమస్య కాదని, నీట్ పరీక్షల్లో రిగ్గింగ్ జరిగిందని, ప్రశ్నాపత్రం లీకైందని, అవినీతి జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వ చర్యల కారణంగా 24 లక్షల మంది నీట్ అభ్యర్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా మోడీ ప్రభుత్వం రిగ్గింగ్, పేపర్ లీక్‌లతో కోట్లాది మంది యువకుల భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. ఎగ్జామ్ సెంటర్, కోచింగ్ సెంటర్‌ల మధ్య సంబంధం ఏర్పడిందని, దీంతో నగదు చెల్లించు, ప్రశ్నాపత్రం తీసుకో అనే గేమ్ ఆడుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం తన చర్యల పరిణామాలను ఎన్‌టిఎ భుజాలపై పడేసి, బాధ్యతల నుండి తప్పించుకోలేదని అన్నారు. నీట్ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు జరపాలని ఉద్ఘాటించారు. ఒకవేళ సిబిఐ విచారణకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేకపోతే, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయమైన విచారణ జరిపించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కట్టుబడి ఉండాలని ఖర్గే పునరుద్ఘాటించారు.

# యడ్యూరప్పకు షాక్

బెంగళూరు, జూన్ 13: కర్ణాటక మాజీ ముఖ్య మంత్రి, బిజెపి నేత బి.ఎస్. యడియూరప్పపై పోక్సో కోర్టు గురువారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. సహాయం కోరుతూ తన తల్లితో పాటు వచ్చిన 17 ఏళ్ల బాలికపై యడియూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడినట్లు మార్చి 14 కేసు నమోదైన సంగతి తెలిసిందే. అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో.. ఈ కేసును విచారిస్తున్న సిఐడి బిజెపి నేతను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఆయన ఢిల్లీలో ఉన్నట్లు యడియూరప్ప కార్యాలయం సమాచారమిచ్చింది. ఈ కేసులో బాధితురాలి రిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కర్ణాటక హైకోర్టు ఇప్పటివరకు నిందితుడిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించింది. దీంతో అరెస్ట్ వారెంట్ జారీ చేయాల్సిందిగా సిఐడి బెంగళూరు ఫాస్ట్ ట్రాక్ కోర్టు 1ని ఆశ్రయించింది. కోర్టు గురువారం సాయంత్రం నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసింది.

# నిబద్ధతతో పనిచేస్తా

**న్యూఢిల్లీ, జూన్ 13:** కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రిగా గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. 'నాకు కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చినందుకు ప్రధాని మోదీ, చంద్రబాబులకు ధన్యవాదాలని పేర్కొన్నారు. పదవి నిర్వహణలో రాణిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు, మోదీతో పాటు బీజేపీ నాయకత్వానికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మార్గదర్శకత్వం కోసం ఇద్దరు డైనమిక్ వ్యక్తులైన శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియాలను అప్పగించారని కొనియారు. ఇందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై కేంద్రం సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ దాడులకు తెగబడుతున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొందరి ఊహా చిత్రాలనూ విడుదల చేశారు. ఈ క్రమంలోనే మోదీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ భేటీలో అజిత్ దోవల్ మోదీ అక్కడి స్థితిగతులూ పూర్తి స్థాయిలో వివరించారు. సాయుధ బలగాలు ఈ దాడులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో కూడా తెలిపారు. ఈ మేరకు మోదీ కొన్ని సూచనలు చేశారు. అవసరమైనతే భారీ మొత్తంలో సాయుధ బలగాలను మోహరించి ఉగ్రవాదుల్ని ఏరి వేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపైనే మోదీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. స్థానిక అధికార యంత్రాంగం ఉగ్రదాడులను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతోందో అడిగి తెలుసుకున్నారు. దొడ జిల్లాలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడ్డాడు. దొడ జిల్లాలో ఇలా దాడి జరగడం రెండోసారి. నాలుగు రోజుల్లో నాలుగు సార్లు జమ్ముకశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో 9 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత భద్రతా బలగాలు ఉగ్రవేట మొదలు పెట్టాయి. కథువా జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దొడలో ఎత్తైన పర్వతాల్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారు. అక్కడి వరకూ వెళ్లి వాళ్లను మట్టుబెట్టడం సవాల్‌గా మారుతోంది. చత్తర్‌గల్లా వద్ద వాళ్ల కోసం గాలిస్తుండగా ఉన్నట్టుండి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు ఉగ్రవాదులు. ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్‌కి చెందిన ఐదుగురు సైనికులతో పాటు ఓ సీనియర్ పోలీస్ అధికారి గాయపడ్డారు.

# చంద్రబాబుకి రాజధాని రైతులు ఘన స్వాగతం












ఎపి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి హోదాలో 5 ఏళ్ల తరువాత సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడుకి రాజధాని రైతులు అత్యంత ఘనమైన స్వాగతం పలికారు. వేల మంది రోడ్ల మీదకు వచ్చి....రాహదారులు అన్నీ పూలమయం చేసి ముఖ్యమంత్రిపై అభిమానం చాటారు. అలాగే సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.








ఆంధ్రపత్రిక ఫోటోలు : సి.హెచ్.విజయభాస్కర్





**విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ ఆలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి గురువారం దర్శించుకున్నారు**









Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com